News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :215 | ఖమ్మం | బుధవారం, సెప్టెంబర్ 9, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా?




- శాసనసభ నిబంధనలను ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా
- ఏజీని ప్రశ్నించిన హైకోర్టు
- హైకోర్టు ఆదేశాలపై పిటిషన్ వేసిన ప్రభుత్వం
- వాదనలు వినిపించిన ఏజీ
- ప్లకార్డులు, వ్యతిరేక రాతలతో ఉన్న టీషర్టులు ధరించి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారన్న ఏజీ

హైదరాబాద్

అసెంబ్లీ బయట జరిగిన పరిణామాలపై హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దంటూ పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. మహిళా ఎమ్మెల్యేలు, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలంటూ డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై అడ్వకేట్ జనరల్

వివరాలు 2లో..



### నా వడోదరా
## అద్భుతం

- ప్రధాని మోదీ భావోద్వేగం
- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- అలకపాన్పు ఎక్కిన మేనమామకు ఇప్పుడు పని దొరికింది
- విపక్షాలపై మోదీ సెటైర్లు
- వడోదరలో రూ.35 వేల కోట్లకుపైగా ప్రాజెక్టులకు శ్రీకారం
- 2,800 కి.మీ. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తి
- 250కుపైగా ట్రక్కుల సరుకును ఒకే రైలులో తరలించిన ఘనత
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు

## రెండోరోజూ అదే 'వే'డి'

- ఢీ అంటే ఢీ అన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్
- అటు అసెంబ్లీలో, ఇటు బయట పోటాపోటీ వ్యూహాలు
- రాజకీయ ఆధిపత్యం కోసం రెండు పార్టీల ప్రయత్నాలు
- రాష్ట్ర మంత్రులు, అసెంబ్లీ కార్యదర్శితో పలుమార్లు భేటీ అయిన ముఖ్యమంత్రి
- తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై చర్యల విషయంలో మంత్రాంగం.. సస్పెన్షన్ తీర్మానంపై చర్చ
- అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం



హైదరాబాద్

అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల ఢీ అంటే ఢీ రెండోరోజూ కొనసాగింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటిరోజు సోమవారం బీఆర్ఎస్ నేతలు నల్ల టీ షర్టులు ధరించి రావడం, వారు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం, 'అనుచిత వ్యాఖ్యల వ్యవహారంతో'పరిస్థితి ఉద్రిక్తంగా మారడం తెలిసిందే. కాగా మంగళవారం కూడా అదే వాతావరణంలో ఉభయ సభలు జరిగాయి. ఈ అంశంపై రాజకీయ ఆధిపత్యం సాధించేందుకు రెండు పార్టీలు పోటీలు పడి వ్యూహాలు రచించాయి. ఇక అసెంబ్లీ బయట కూడా ఇదే తీరు కొనసాగించాయి. అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీశ్‌రావుల మధ్య మాటల యుద్ధం

వివరాలు 2లో..

## వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే..



- లక్నో టాప్, హైదరాబాద్ 19, విశాఖ 21
- స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో లక్నోకు అగ్రస్థానం
- 10 లక్షల జనాభా నగరాల కేటగిరీలో ఢిల్లీకి 21వ ర్యాంక్
- విశాఖతో కలిసి 21వ ర్యాంక్ పంచుకున్న దేశ రాజధాని నగరం
- గాలి నాణ్యతతో కాకుండా కాలుష్య నియంత్రణ చర్యల ఆధారంగా ఈ ర్యాంకులు
- హైదరాబాద్‌కు 19వ స్థానం, ముంబైకి 28వ ర్యాంక్

## బ్రిక్స్ సదస్సు వేళ ప్రధాని మోదీ, పుతిన్ భేటీ



- ద్వైపాక్షిక వాణిజ్యం, రక్షణ, ఆర్థిక సహకారంపై చర్చ!
- సెప్టెంబర్ 11న భేటీ కానున్న మోదీ, పుతిన్
- అజెండాలో ఎస్‌యూ-57 విమానాల డీల్
- వెల్లడించిన క్రెమ్లిన్ అధికార ప్రతినిధి



## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు

- రైల్వే మంత్రి కీలక ప్రకటన
- వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్
- 2 నుంచి 4 నెలల తర్వాత అధికారికంగా ప్రారంభం
- తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్వినీ వైష్ణవ్
- సూరత్-వాపి మార్గం డిసెంబరులో పూర్తయ్యే అవకాశం
- గంటన్నరలో ముంబై నుంచి వడోదరకు

### తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి
# సస్పెండ్



- ప్రకటించిన మండలి ఛైర్మన్
- శాసన మండలిలో తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయాలని తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు
- మూజువాణీ పద్దతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్
- సెషన్ మొత్తానికి సస్పెండ్ చేసినట్టు ప్రకటించిన ఛైర్మన్

హైదరాబాద్

శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్ సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది. అంతకుముందు సభాపతి గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తూ చేసిన తీర్మానానికి

వివరాలు 2లో..

### అరాచకాలను అరికట్టేందుకు అమిత్
## షా శాఖ ఏం చేస్తోంది?

- ఢిల్లీలో మణిపురి సంగీతకారుడి కొట్టిచంపిన ఘటనపై రాహుల్‌గాంధీ స్పందన
- ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీలో భద్రత ఉందా అంటూ ప్రశ్న
- కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, ఢిల్లీ పోలీసుల తీరుపై విమర్శలు



## సెప్టెంబర్‌లోనూ వర్షాల లోటే

- సెప్టెంబర్‌లో దక్షిణ ద్వీపకల్పంలో వర్షాల పరిస్థితి బలహీనంగానే ఉండే అవకాశం
- ఏపీలో 45 శాతం, కేరళలో 24 శాతం వర్షపాతం లోటు
- తెలంగాణలో 8 నుంచి 10 వరకు అక్కడక్కడా వర్షాలు



### ఏఐఐబీ సహకారంతో
## స్కూళ్లకు మహర్దశ

- ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు
- నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటు
- అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు




హైదరాబాద్

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటును వేగవంతం చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పాఠశాలల నిర్మాణానికి మొత్తం రూ.699.89 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇందులో రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ.209.96 కోట్లు కేటాయించగా..


వివరాలు 2లో..

# రెండోరోజూ అదే వేడి'

-మొదటిపేజీ తరువాయి

సాగగా, కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసం ముట్టడి కార్యక్రమం, కేసీఆర్‌ను ఉద్దేశించి ఆ పార్టీ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు తాజా ఉద్రిక్తతకు, వివాదానికి దారి తీశాయి. మరోవైపు మహిళా పోలీసులపై బీఆర్ఎస్ సభ్యుల దురుసు ప్రవర్తనపై కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు తెలంగాణ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఇక అసెంబ్లీ లాబీల్లోనూ ఇదే అంశం నడిచింది.



### ఎమ్మెల్యేలతో మంతనాలు

ఉదయం అసెంబ్లీకి రాగానే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి స్పీకర్ చాంబర్‌కు వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ప్రభుత్వం పక్షాన అండగా ఉంటామని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఓదార్చారు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి తన చాంబర్‌లో రాష్ట్ర మంత్రులతో పలు దఫాలు సమావేశమయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిల విషయంలో అసెంబ్లీ వేదికగా ఏం చేయాలన్న దానిపై అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతితో చర్చించారు. ప్రభుత్వం తరఫున ప్రవేశపెట్టే తీర్మానం ఎలా ఉండాలి? భవిష్యత్తులో న్యాయ వివాదాలు రాకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే విషయాలపై మాట్లాడిన సీఎం.. ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని శాసనమండలిని కోరుతూ శాసనసభలో మంత్రి దామోదర రాజనర్సింహతో తీర్మానం ప్రతిపాదింపజేసి, ఆమోదింపజేయాలని నిర్ణయించారు. మరోవైపు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు కూడా పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమై చర్చించారు. కాంగ్రెస్ ముట్టడి కార్యక్రమాన్ని ధీటుగా ఎదుర్కోవాలని, ఎమ్మెల్సీలు మాత్రం సభలోనే ఉండాలని నిర్ణయించారు. తాతా మధు, నవీన్‌రెడ్డిల సస్పెన్షన్ నేపథ్యంలో నిరసనలు, ధర్నాతో బీఆర్ఎస్ నేతలు వాతావరణాన్ని మరింత వేడెక్కించారు.

### 'అనుచిత వ్యాఖ్యలపై'చర్చ..సస్పెన్షన్ తీర్మానం

మంగళవారం మధ్యాహ్నం సభ ప్రారంభమైన తర్వాత ప్యానెల్ స్పీకర్ స్థానంలోకి వచ్చిన కడియం శ్రీహరి సోమవారం నాటి అనుచిత వ్యాఖ్యల వ్యవహారంపై చర్చను ప్రారంభించారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించగా, పలువురు మహిళా ఎమ్మెల్యేలు, మంత్రులు మాట్లాడారు. ఆ తర్వాత మంత్రి దామోదర రాజనర్సింహ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యకు విజ్ఞప్తి తీర్మానం ప్రవేశపెట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడిన తర్వాత ఈ తీర్మానాన్ని సభ ఆమోదించి శాసనమండలికి పంపింది.

### స్పీకర్ మనస్తాపం..

తాతా మధు ఎపిసోడ్‌లో కాంగ్రెస్ పార్టీని ధీటుగా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించింది. అసెంబ్లీలో మాట్లాడిన హరీశ్‌రావు వీలున్నంత వరకు తమ పార్టీ ఎమ్మెల్సీలకు మద్దతుగా నిలిచే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగానే స్పీకర్ ప్రసాద్‌కుమార్ కొంత ఆవేశానికి లోనయ్యారు. హరీశ్‌రావును ఉద్దేశించి ఆగ్రహంగా వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యుల వైఖరి, హరీశ్‌రావు వ్యాఖ్యలకు స్పీకర్ మనస్తాపం చెందారు. ఉదయం సభను కొంతసేపు వాయిదా వేసిన అనంతరం చాలాసేపు ఆయన తన చాంబర్‌లోనే ఉన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు అసెంబ్లీ కార్యదర్శితో మాట్లాడారు. విలేకరులతో ఇష్టాగోష్టిలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఆ తర్వాత సభ లోపలికి వెళ్లిన ఆయన మనస్తాపం కారణంగా కొద్దిసేపు మాత్రమే సభా కార్యకలాపాలు నిర్వహించి, ప్యానల్ స్పీకర్ కడియం శ్రీహరికి సభాధ్యక్షత బాధ్యతను అప్పగించి వెళ్లిపోయారు.

### మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై..కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నేతలు మంగళవారం రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేలు ఉత్తమ్ పద్మావతి, మట్టా రాగమయి, పరి?ణికారెడ్డి, యశస్వినిరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మహిళా నేతలు కల్వ సుజాత, గుండు సుధారాణి, ఇందిరా శోభన్‌లు మహిళా కమిషన్‌ను కలిశారు. మహిళా పోలీసుల పట్ల దురుసుగా వ్యవహరించారని, వారి ముందే అర్ధనగ్న ప్రదర్శన చేశారని, అనుచితంగా వ్యవహరించారంటూ కమిషన్ కార్యదర్శి, సభ్యులకు ఫిర్యాదును అందజేశారు.

### తగ్గని బీఆర్ఎస్

**-- అసెంబ్లీ లోపలా, బయటా ఆందోళనలు**
**-- నల్ల బ్యాడ్జీలతో సమావేశాలకు హాజరు**
**-- కాంగ్రెస్ చేపట్టిన కేసీఆర్ ఎర్రవల్లి నివాసం ముట్టడి కార్యక్రమంపై మండిపాటు**
**-- తాతా మధు, నవీన్‌రెడ్డి సస్పెన్షన్‌పై నిరసన, ధర్నా**

ప్రదాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అసెంబ్లీ లోపలా, బయట అధికార కాంగ్రెస్ పార్టీపై యుద్ధం కొనసాగించింది. మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల బ్యాడ్జీలు ధరించి సమావేశాలకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన చర్చల్లో ప్రతిష్టంభన నెలకొనడంతో స్పీకర్ సభకు విరామం ప్రకటించారు. ఈ నేపథ్యంలో శాసనసభ లాబీల్లోని బీఆర్ఎస్ శాసనసభా పక్ష కార్యాలయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. సభ లోపలా బయటా కాంగ్రెస్ అనుసరిస్తున్న ఎత్తుగడలపై చర్చించారు. ఎర్రవల్లిలో పార్టీ అధినేత కేసీఆర్ ఇంటి ముట్టడికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెళ్తున్నట్లు అందిన సమాచారంపై చర్చించారు. వారికి పోలీసులు సహకరిస్తున్నారని తెలియడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఎర్రవల్లికి వెళ్లాలని నిర్ణయించారు. అయితే పార్టీ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేస్తారనే వార్తల నేపథ్యంలో ఎమ్మెల్సీలు మాత్రం సభలోనే ఉండాలని నిర్ణయించారు.

### బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య తోపులాట

ఎర్రవల్లిలో కేసీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. అయితే రాజీవ్ రహదారి మీదుగా ఎర్రవల్లికి వెళ్లే క్రమంలో నగర శివారులోని బొల్లారం, హకీంపేట వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై నిరసన తెలుపుతూ తమ వాహనాల నుంచి దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాలి నడకన ఎర్రవల్లికి బయలుదేరారు. అయితే హరీశ్‌రావుతో పాటు కొందరు ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రోడ్డుపై బైఠాయించిన నిరసన తెలిపిన కేటీఆర్‌తో పాటు మరికొందరు ఎమ్మెల్యేలను బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. పార్టీ ఎమ్మెల్యేల అరెస్టు వార్తను తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్లకు చేరుకోవడంతో ఉద్రిక్తత తలెత్తింది. బోయినపల్లి పోలీసు స్టేషన్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పరస్పరం తోపులాటకు, దాడికి దిగాయి. సాయంత్రం ఐదు గంటల వరకు నేతలను పోలీసు స్టేషన్‌లోనే నిర్బంధించిన పోలీసులు ఆ తర్వాత వదిలి పెట్టారు. పోలీసు నిర్బంధం నుంచి విడుదలైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సాయంత్రం తిరిగి అసెంబ్లీకి చేరుకున్నారు.

### నిరసనలు..ధర్నా

తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల అసెంబ్లీ బయట పోలీసులు దురుసుగా వ్యవహరించారని, ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ మంగళవారం శాసనసభలో వాయిదా తీర్మానం ఇచ్చింది. మరోవైపు తమ పార్టీ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని అరెస్టు చేయడంపై మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ నిరసన తెలపడంతో సమావేశాలకు అంతరాయం కలిగింది. తర్వాత సాయంత్రం మధు, నవీన్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. మండలి చైర్మన్ చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రతిపక్ష నేత మధుసూదనాచారి నేతృత్వంలో జరిగిన నిరసనలో ఏకపక్షంగా సస్పెన్షన్ విధించి సభను వాయిదా వేసుకుని వెళ్లారని విమర్శించారు. సస్పెన్షన్‌కు సంబంధించిన శాసనసభ తీర్మానం కాపీని తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చ లేకుండా ఎమ్మెల్సీల సస్పెన్షన్‌కు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కొద్దిసేపు గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ.. ధర్నా నిర్వహించారు. ఆ తరువాత వారిని పోలీసులు అక్కడ నుంచి పంపించేశారు. మీడియా పాయింట్‌లో తాతా మధు మాట్లాడుతుండగా అసెంబ్లీ మార్షల్స్ ఆయనను అడ్డుకున్నారు. మధు, నవీన్‌కుమార్‌రెడ్డిని బలవంతంగా అక్కడి నుంచి తీసుకెళ్లడంతో బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు కేసీఆర్‌ను ఉద్దేశించి షాద్‌నగర్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ నేతలు మండిపడ్డారు.

# కమలంలో కనిపించని అగ్రెసివ్ అప్రోచ్



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ రంగంలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సవాలును, అదే సమయంలో అపారమైన అవకాశాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు కావాల్సిన సానుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆ అవకాశాలను ప్రత్యక్ష రాజకీయ ప్రయోజనాలుగా మలచుకోవడంలో బీజేపీ పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ స్థానాలను గెలుచుకుని, 35 శాతం మేర ఓటు షేర్‌ను సాధించి తన ప్రాభవాన్ని చాటుకున్నప్పటికీ, ఆ ఊపును క్షేత్రస్థాయి స్థానిక సంస్థల ఎన్నికలు మరియు నియోజకవర్గ స్థాయిలో నిలబెట్టుకోవడంలో పార్టీ కొంత తడబడుతోంది.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో వ్యక్తమవుతున్న అతిపెద్ద లోపం బలమైన నిలకడైన నాయకత్వం . ఉత్తర తెలంగాణలో పార్టీకి గట్టి పట్టు ఉన్నప్పటికీ, తెలంగాణ వ్యాప్తంగా ఓటర్లను ఆకర్షించగల, సర్వామోదయోగ్యమైన అగ్రనేత కొరత స్పష్టంగా కనిపిస్తోంది. తరచూ మారుతున్న వ్యూహాలు, నాయకత్వ మార్పులు, అంతర్గత విబేధాలు క్యాడర్‌లో గందరగోళాన్ని నింపుతున్నాయి. ప్రజల సమస్యలపై నిలకడగా పోరాటం చేస్తూ, ప్రతీ నియోజకవర్గంలో పార్టీని నడిపించే ఒక పవర్‌ఫుల్ ఫేస్ లేకపోవడం పార్టీ విస్తరణకు ప్రధాన ప్రతిబంధకంగా మారిందిపాక్షికంగా బిఆర్ఎస్ వైఖరి పట్ల సానుభూతి, మెత్తటి వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం కూడా బీజేపీకి రాజకీయంగా నష్టం చేకూరుస్తోంది. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై కోపంతో ఉన్న ఓటర్లు లేదా కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి చెందుతున్న ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూడాలంటే.. బీజేపీ స్పష్టమైన ప్రతిపక్ష పాత్రను పోషించాల్సి ఉంటుంది. బిఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతున్న ప్రతిసారీ ఆ పార్టీ స్థానాన్ని ఆక్రమించడంలో వెనకబడితే, ఆ ఓటు బ్యాంక్ మొత్తం తిరిగి కాంగ్రెస్ వైపునకో లేదా స్వతంత్రుల వైపునకో మరలే ప్రమాదం ఉంది.భవిష్యత్తులో బీజేపీ అధికార పీఠానికి చేరువ కావాలంటే, బిఆర్ఎస్ సాంప్రదాయక ఓటు బ్యాంకును కైవసం చేసుకోవడమే ఏకైక మార్గం. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు అండగా నిలిచిన గ్రామీణ, వెనుకబడిన వర్గాలు, తటస్థ ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు పక్కా ప్రణాళిక అవసరం. బిఆర్ఎస్ నాయకత్వం రెస్ట్ మోడ్‌లో ఉందనే భావన ప్రజల్లో ఉన్నప్పుడు, ఆ ఖాళీని బీజేపీ తన నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారా భర్తీ చేయాలి. కేవలం హిందూత్వ ఎజెండా లేదా పార్లమెంట్ ఎన్నికల నాటి ఇమేజ్‌పైనే ఆధారపడకుండా, స్థానిక సమస్యలపై పోరాటం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ మార్గం అనుకున్నంత సులువు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కాంగ్రెస్ తన సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయి యంత్రాంగంతో బలంగా నిలబడింది. బిఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆకర్షించడంలో కాంగ్రెస్ సైతం తన మార్క్ చూపుతోంది. ఈ త్రికోణ పోటీలో బీజేపీ తన ప్రత్యర్థి కేవలం కాంగ్రెస్ మాత్రమేనని చాటిచెబుతూ, బిఆర్ఎస్ మిగిల్చిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి సమగ్రమైన సంస్థాగత నిర్మాణం చేపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధ్యం కాదు.రాబోయే రెండేళ్ల సమయం తెలంగాణ బీజేపీకి అత్యంత కీలకమైనది. పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధి దాటి, గల్లీ స్థాయి వరకు కమిటీలను బలోపేతం చేసుకోవడం, ఇతర పార్టీల నుంచి సీనియర్ నేతలను ఆకర్షించడం మరియు ఓటర్లలో నమ్మకాన్ని కలిగించేలా ఏకీకృత నాయకత్వాన్ని తీసుకురావడం తక్షణ అవసరం. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, సానుభూతి రాజకీయాలను పక్కనబెట్టి అగ్రెసివ్ అప్రోచ్‌తో ముందుకు వెళ్తేనే తెలంగాణలో కమలం వికసించే అవకాశాలు మెరుగవుతాయి

## తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెండ్

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ ఆమోదం తెలిపింది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీర్మానం ప్రతిపాదించారు. స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోందని, సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోందని, మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోందని సభ తెలిపింది.

బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలని, శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, నిబంధనలకు అనుగుణంగా మండలి చైర్మన్ చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానం చేసింది. రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిలో ఉండి కూడా అవమానం ఎదుర్కోవాల్సి రావటం బాధాకరమని దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఇద్దరు మండలి సభ్యులపైనా క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేస్తూ తీర్మానించారు.

### సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్

మండలిలో ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్?ను బీఆర్?ఎస్ సభ్యులు ఖండించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను చట్ట విరుద్ధంగా సస్పెండ్ చేశారని శాసనమండలి ఆవరణలో బైఠాయించారు. తాతా మధు, నవీన్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

### తాతా మధు మాట్లాడకుండా అడ్డుకున్న మార్షల్స్

తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెన్షన్ అనంతరం ప్రాంగణంలో గందరగోళం నెలకొంది. మీడియా పాయింట్‌లో తాతా మధు మాట్లాడుతుండగా మార్షల్స్ అడ్డుకున్నారు. సస్పెన్షన్ వేటు పడినందున ప్రాంగణంలో మాట్లాడవద్దని అధికారులు తెలిపారు. తాతా మధును అదుపులోకి తీసుకుని వ్యానులో తరలించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు బీఆర్?ఎస్?ఎల్పీలో ఆ పార్టీ సభ్యులు సమావేశమయ్యారు.

## ఏఐఐబీ సహకారంతో స్కూళ్లకు మహర్దశ

-మొదటిపేజీ తరువాయి

మరో రూ.489.93 కోట్లను ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణంగా సమకూర్చనుంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి నిర్మాణ ప్రక్రియను వేగంగా చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు, తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెలలోనే నిర్మాణ పనులకు టెండర్లు పిలవనున్నట్లు టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గత ఫిబ్రవరిలో నిర్ణయించారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం, అచ్చంపేట నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున, గజ్వేల్‌లో ఒక టీపీఎస్‌కు అనుమతులు లభించాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని ఆరుట్ల టీపీఎస్ ఇప్పటికే ప్రారంభమైంది. మిగిలిన పాఠశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రతిపాదించిన 95 పాఠశాలల్లో 73కి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పటివరకు మంజూరైన టీపీఎస్‌ల సంఖ్య 78కు చేరింది. మిగిలిన పాఠశాలలపై కూడా త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు భిన్నంగా టీపీఎస్‌లు సెమీ రెసిడెన్షియల్ విధానంలో పనిచేయనున్నాయి. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కూడా అవసరమైన మౌలిక వసతులతో టీపీఎస్‌లుగా తీర్చిదిద్దనున్నారు. సాధారణంగా కనీసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలం ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి.. వాటి పరిధిలోని సమీపంలోని మరో రెండు, మూడు పాఠశాలలను విలీనం చేసే విధానాన్ని అనుసరించనున్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో సమీపంలోని జూనియర్ కళాశాలలను కూడా ఈ సముదాయాల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.టీపీఎస్‌లలో విద్యార్థులకు తరగతి గదులతో పాటు క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, గ్రంథాలయాలు, కంప్యూటర్–సైన్స్ ల్యాబ్‌లు, ప్రీప్రైమరీ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రీప్రైమరీ నుంచి పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యను ఒకే క్యాంపస్‌లో అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పాఠశాలల విలీనం ద్వారా ఒక్కో టీపీఎస్‌లో విద్యార్థుల సంఖ్య కనీసం 1000 నుంచి 1500 వరకు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదవడం ద్వారా మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో ఉపాధ్యాయుల సంఖ్య పెరగడం, వనరులను సమర్థంగా వినియోగించడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.సాధారణ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందుతున్న నేపథ్యంలో.. టీపీఎస్‌లలో సాయంత్రం కూడా అల్పాహారం అందించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచడమే టీపీఎస్‌ల ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

## స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా?

-మొదటిపేజీ తరువాయి



సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. చీఫ్ మార్షల్ పోలీసులకు సూచనలు చేశారు

సభను సజావుగా నడిపించే బాధ్యత స్పీకర్‌పై ఉంటుందని ఏజీ వాదించారు. ప్లకార్డులు, రాతలతో కూడిన నల్ల టీషర్టులతో శాసనసభలోకి ప్రవేశం లేదన్నారు. స్పీకర్ ఆదేశాలతో చీఫ్ మార్షల్ పోలీసులకు సూచనలు చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారన్నారు. అసెంబ్లీ పరిసరాల్లో ర్యాలీలు, నిరసనలపై నిషేధం విధిస్తూ హైదరాబాద్ సీపీ ఆదేశాలు కూడా అమల్లో ఉన్నాయని ఏజీ వాదించారు. నల్ల టీషర్టులతో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యేలను శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా పోలీసులు అడ్డుకున్నారని ఏజీ వాదనలు వినిపించారు.

### మహిళా పోలీసులతో అనుచితంగా ప్రవర్తించారు

విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించారని న్యాయస్థానం దృష్టికి ఏజీ తీసుకొచ్చారు. ఇతర పోలీసు అధికారులను కూడా దూషించారని ఏజీ తెలిపారు. నల్ల టీషర్టులు ధరించి ప్రజల్లో భయానక వాతావరణం సృష్టించేలా ఎమ్మెల్యేలు ప్రవర్తించారని ఏజీ కోర్టుకు తెలిపారు. ఎమ్మెల్యేలతో దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్న కోర్టు ఉత్తర్వులను సవరించాలని ఏజీ కోరారు.

### స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా?

అయితే ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం, శాసనసభ నియమావళిని ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా అని ఏజీని ప్రశ్నించింది. పోలీసులు ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల పట్ల ఎందుకు అనుచితంగా ప్రవర్తించారని హైకోర్టు ప్రశ్నించింది. పోలీసులు ఎవరితోనూ అలా ప్రవర్తించలేదని, మహిళా ఎమ్మెల్యేలను లోపలికి వెళ్లకుండా అడ్డుకోలేదని ఏజీ వాదించారు. నియమావళిలోని విషయాలను శాసనసభ్యులకు ఘటన కంటే ముందే తెలియజేశారా అని హైకోర్టు ప్రశ్నించగా, సాధారణంగా అమల్లో ఉండే నిబంధనలేనని ఏజీ తెలిపారు.

### తెలంగాణ భవన్‌కు ఎందుకు తీసుకెళ్లారు

సభ్యులను అసెంబ్లీలోకి ప్రవేశించకుండా అడ్డుకునే అధికారం పోలీసులకు లేదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది వాదించారు. చీఫ్ మార్షల్?కు స్పీకర్ ఆదేశాలున్నట్లు ఎలాంటి లేఖలు ప్రభుత్వం సమర్పించలేదన్నారు. ఎమ్మెల్యేలు ఏదైనా నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కానీ పోలీసులు కాదని బీఆర్ఎస్ న్యాయవాది వాదించారు. నిన్న పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్?లో పేర్కొన్న అంశాలనే ప్రభుత్వం కౌంటర్?గా దాఖలు చేసిందన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని, భావిస్తే సదరు ఎమ్మెల్యేలను స్పీకర్ దగ్గరికి తీసుకెళ్లకుండా, అరెస్ట్ చేసి తెలంగాణ భవన్?కు ఎందుకు తీసుకెళ్లారని వాదించారు. సోమవారం నాటి కోర్టు ఉత్తర్వుల్లో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో కోర్టు తీర్పును రిజర్వు చేసింది.

## శ్రీ మహంకాళి హోమం పూజలో, సర్పంచ్ దంపతులు

- శ్రీ మహంకాళి ఉత్సవాలు ప్రారంభం : మొక్కులు చెల్లించుకున్న చైర్మన్ దంపతులు
- చైర్మెన్ సతీష్ స్రవంతి కుటుంబ సమేతంగా, పట్టుచీర సమర్పించారు,





**సెప్టెంబర్ 08 (సీ కే న్యూస్) చేగుంట** చేగుంట పట్టణ కేంద్రంలో వెలసిన శ్రీశ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మూడవ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నాడు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. చేగుంట ఆలయ కమిటీ చైర్మన్ సంద్రుగు సతీష్ ఆధ్వర్యంలో మొదటి రోజు ఉత్సవాలు ఆలయ ప్రాంగణంలో విశేష హోమం, సామూహిక అంగ రంగ వైభవంగా కుంకుమార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి హోమంలో పట్టుచీరను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి–సతీష్ దంపతులు, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ?ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ పోరండ్ల రాఘవేంద్ర శర్మ వైదిక ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ పూజా క్రతువులు నిర్విఘ్నంగా సాగాయి. ఈ సందర్భంగా అర్చకులు రాఘవేంద్ర శర్మ మాట్లాడుతూ... సాయంకాల వేళల్లో అమ్మవారికి సంధ్యా హారతి, ఏకాదశి హారతులు, నీరాజన మంత్రపుష్పాల సమర్పణతో పాటు ప్రత్యేక అలంకరణ పూజలు జరుగుతాయని తెలిపారు. శ్రీ మహంకాళి అమ్మవారి కృపాకటాక్షాలతో చేగుంట గ్రామ, మండల ప్రజలు, ముఖ్యంగా రైతాంగం ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే బుధవారం అమ్మవారి ఆలయంలో జరిగే అన్నదాన కార్యక్రమానికి భక్తులందరూ రాగలరని కోరినారు. వార్షికోత్సవాల సందర్భంగా ఆలయం భక్తుల జయజయధ్వానాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ కమిటీ వైస్ చైర్మన్లు గుండ్ల సంపత్, గొల్ల సత్తయ్య, కమిటీ సభ్యులు ఉదయభాస్కర్, ఆకుల సిద్ధిరాములు, సంద్రులు రవి, పూలబోయిన రఘుపతి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అప్రజాస్వామిక పాలన కాంగ్రెస్ పాలన

- బిఆర్ ఎస్ మండల అధ్యక్షులు నారాయణ రెడ్డి



**సెప్టెంబర్ 08 (సీ కే న్యూస్) చేగుంట** :చేగుంట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై చేసిన దాడి కారణంగా మండల కేంద్రంలో రోడ్డుపై బఠాయించిన బిఆర్ఎస్ నాయకులు, వర్షాకాల సమావేశాల సందర్భంగా అసెంబ్లీలోకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలను పోలీసులతో అడ్డుకుని,అరెస్టు చేయడం అప్రజాస్వామికమని చేగుంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నారాయణ రెడ్డి అన్నారు .సోమవారం ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి మెమోరండం అందించి గాంధీ చౌరస్తా వద్ద రహదారిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు,జెండాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 420 హామీలను,13 డిక్లేషన్లు,6 గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి,పట్టణ అధ్యక్షులు ఎర్ర యాదగిరి. డిష్ రాజ్, సోమ సత్యనారాయణ. కామర పంజనేయులు. పుర లక్ష్మణ్. జనరల్ సింగ్. కటిక రాజేష్. భువనగిరి నరసింహులు. రెడ్డిపల్లి నరసింహులు. నీల రాములు. శంకర్. మహేష్.. మంచి కట్ల వంశీ.
వివిధ గ్రామాల బీఆర్ఎస్ సర్పంచులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



**సికె.న్యూస్. నేరడిగొండ** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ జాతిపిత శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (ఖజ=) మరణాన్ని బహిరంగంగా కోరుతూ ఆయనకు హాని చేయడానికి ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే కే. శంకరయ్య మరియు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలాగే ఇతర కుట్రదారులపై కేసు నమోదు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు మేరకు, మండల కన్వీనర్ అల్లూరి శివ రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు నేరడిగొండ పోలీస్ స్టేషన్ యందు నేరడిగొండ మండల భారత రాష్ట్ర సమితి సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు ఫిటిషన్ ఇచ్చారు

# మధిరలో కమల్ రాజు ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

**తాత మధు అక్రమ అరెస్టుకు, మహిళా శాసనసభ్యులపై దాడి,పోలీసుల తీరుకు నిరసనగా మధిరలో కదంతొక్కిన మహిళలు**



**మధిర సెప్టెంబర్ 08(సికె న్యూస్)ప్రతినిధి.** కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై మధిరలో మహిళలు కన్నెర్ర చేశారు. ఎమ్మెల్సీ తాత మధు గారి అక్రమ అరెస్ట్‌ను మరియు నిన్న అసెంబ్లీ వద్ద మహిళా శాసనసభ్యులపై జరిగిన పాశవిక దాడిని నిరసిస్తూ మాజీ జడ్పీ చైర్మన్, బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో మధిర పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ర్యాలీలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.మధిర పురవీధుల్లో మహిళల కదంతొక్కిన ఈ ర్యాలీతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న ఆగ్రహం స్పష్టంగా కనిపించింది. ప్రశ్నిస్తే అరెస్టులు.. నిరసిస్తే దాడులు.. ఇదేనా కాంగ్రెస్ ప్రజాపాలన? అంటూ మహిళలు ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజల తరపున ప్రశ్నించే హక్కును కాలరాస్తూ అరెస్టులు, దాడులకు పాల్పడటం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి నిదర్శనం అని కమల్ రాజు తీవ్రంగా విమర్శించారు.మహిళా శాసనసభ్యులపై దాడి చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై చేయి చేసుకునే స్థాయికి ప్రభుత్వం దిగజారడం సిగ్గుచేటని, దీనికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పక్కన పెట్టి నయవంచన పాలన సాగిస్తోందని కమల్ రాజు ఆరోపించారు. ప్రజల గొంతుకలను అణచివేయడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను దాచిపెట్టలేరని అన్నారు.తాత మధు గారి అరెస్ట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, మహిళా శాసనసభ్యులపై దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని కమల్ రాజు హెచ్చరించారు.మధిరలో జరిగిన ఈ భారీ నిరసన ర్యాలీతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత మరోసారి బహిర్గతమైందని కమల్ రాజు పేర్కొన్నారు. ప్రజల గొంతును అణచాలని చూస్తే.. అదే ప్రజాగ్రహం ప్రభుత్వాన్ని ప్రశ్నించే మహా ఉద్యమంగా మారుతుందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో పార్టీ వివిధ మండలాల మాజీ అధ్యక్షులు,మాజీ కార్యదర్శులు, సర్పంచులు మాజీ సర్పంచులు, మహిళా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలి

- దళిత స్పీకర్‌ను అవమానించడం తాతా మధు అహంకారానికి పరాకాష్ట
- బీఆర్ఎస్ నేతల నోటి దురుసుకు ప్రజలే సమాధానం చెబుతారు



**మధిర సెప్టెంబర్ 08 (సికె న్యూస్)ప్రతినిధి.** మధిర: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ రావుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మధిర మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సభా గౌరవాన్ని, రాజ్యాంగబద్ధమైన పదవిని అవమానించేలా మాట్లాడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.దళిత సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ రావు ఇంతటి నోటి దురుసుతో మాట్లాడటం తాతా మధు అహంకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు. దళితుల ఆత్మగౌరవాన్ని గౌరవించకుండా అవమానకరంగా మాట్లాడే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.తాతా మధూ..దళిత నాయకుడి పై నోరు పారేసుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. స్పీకర్ పదవిని అవమానించినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలి. శాసనసభ గౌరవాన్ని కాపాడేందుకు వెంటనే సస్పెండ్ చేయాలి” అని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోయినా అహంకారం మాత్రం ఇంకా పోలేదని, పదవి పోయిన బాధతో రాజ్యాంగబద్ధమైన పదవులపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు.స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పే వరకు తాతా మధు ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాతా మధు పై కఠిన చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.స్పీకర్ గౌరవం అంటే రాజ్యాంగ గౌరవం.. దళితుల ఆత్మగౌరవం అంటే తెలంగాణ ఆత్మగౌరవం. దానిని అవమానించే తాతా మధు ను వెంటనే సస్పెండ్ చేయాల్సిందే! అని కాంగ్రెస్ నాయకులు నినదించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు జిల్లా సెక్రటరీ పులిబండ్ల చిట్టిబాబు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తుమాటి నవీన్ రెడ్డి, కౌన్సిలర్లు బాణావత్ వెంకటరమణ నాయక్ బెజ్జం రాజు, దార నాగార్జున కాంగ్రెస్ పార్టీ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు దేవి శెట్టి రంగారావు మువ్వ వెంకయ్య బాబు పత్తిపరపు సంగయ్య సామినేని రామనాథం బిట్రా ఉద్దండయ్యా ఆదూరి శీను మోదుగు బాబు యూత్ కాంగ్రెస్ నాయకులు సాలిక సురేష్ గద్దల రాజా, గౌసుద్దీన్ మరియు వివిధ హోదాలలోని కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల నాయకులు పాల్గొన్నారు.

## మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సర్పంచ్ జి. రాముడు



**మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా...**

**మల్దకల్ సెప్టెంబర్ 8:** జోగులంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం చర్లగార్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందడంతో చర్ల గార్లపాడు గ్రామ సర్పంచ్ జి. రాముడు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి మృతుడి కుటుంబ సభ్యులుకు 5000 రూపాయలు ఆర్థిక సాయం సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యుల దుఃఖాన్ని పంచుకుంటూ వారికి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ జి. రాముడు మాట్లాడుతూ.. కుటుంబంలో ఒక వ్యక్తిని కోల్పోవడం ఎంతో బాధాకరమైన విషయమని, ఈ కష్ట సమయంలో మృతుడి కుటుంబ సభ్యులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. గ్రామ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి అవసరమైన సహాయం అందించడంతో పాటు, భవిష్యత్తులో కూడా వారికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.
మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని సర్పంచ్ జి. రాముడు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొని మృతుడికి నివాళులర్పించారు.

## కాంగ్రెస్ నాయకుని మృతి నాయకుల ఘన నివాళి





**మధిర సెప్టెంబర్ 08 (సికె న్యూస్) ప్రతినిధి.**
మధిర మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి శేషయ్య అకాల మృతి చెందగా భౌతికాయానికి పూలమాలవేసి నివాళు లర్పించిన మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు బిట్ర ఉద్దండయ్య, నిడమానూరు వంశీకృష్ణ గ్రామ సర్పంచ్ కుక్కమళ్ళ సునీల్ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు రావిరాల సత్యనారాయణ, బండారు ఏడుకొండలు, బండారు గంగాధర్, జానపాటి శ్రీనివాసరావు సాకి కొండలు తదితరులు ఉన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## దళితులు అంటే బిఆర్ఎస్ కు చిన్న చూపు

కాంగ్రెస్ పార్టి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నర్సింలు



**సెప్టెంబర్ 08 (సీ కే న్యూస్) చేగుంట** సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన తాత మధు, వాక్యాలపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింలు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ దళితుడైన స్పీకర్ పై చేసిన వ్యాఖ్యలు కొంచెం కూడా గౌరవం లేదని దానికి నిదర్శనమే అసెంబ్లీ అని, తీవ్రమైన పదజాలం ప్రయోగించడం సిగ్గు చేటు అని అన్నారు, మండల్ జనరల్ సెక్రెటరీ కొండి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో దొరలకు దళితులు అంటే చిన్న చూపుగా ఉందని దుయ్యబట్టారు, తక్షణమే బిఆర్ఎస్ పార్టీ తాత మధు, యావత్ రాష్ట్ర దళితులకు క్షమాపణ చెప్పాలని మండిపడ్డారు, క్షమాపణ చెప్పకుంటే తాత మధును దళితులు ఉరికించి ఊరికించి కొడతారని వారు మండిపడ్డారు తక్షణమే స్పీకర్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్, శ్రీను పాల్గొన్నారు,

# భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్.

- మూడు రోజుల్లో సర్వే పూర్తి చేయాలి.
- రైతులు అవసరమైన పత్రాలు, భూమి హద్దులు చూపించి సహకరించాలి.



**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08,** పాల్వంచ మండలంలోని బోజ్యా తండా పరిధిలో చేపడుతున్న భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బోజ్యా తండా పరిధిలోని సర్వే నంబర్ 77లో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
రీ-సర్వేలో భాగంగా రోవర్ పరికరాల సహాయంతో భూములను కొలుస్తున్న విధానాన్ని, భూముల హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, స్థానాన్ని ఖచ్చితంగా గుర్తించి, సంబంధిత భూ రికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.
బోజ్యా తండా పరిధిలో మొత్తం 458 ఎకరాల్లో రీ-సర్వే చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం సర్వే నంబర్ 77లో 88 ఎకరాల్లో పనులు కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు జరిగిన సర్వే పురోగతి, మిగిలిన భూముల్లో చేపట్టాల్సిన పనులు, అవసరమైన సిబ్బంది, పరికరాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.
ప్రతి భూ యజమాని భూమి హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుబాటులో ఉన్న భూ రికార్డులతో సరిపోల్చాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేలో ఎలాంటి జాప్యం లేకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.
గ్రామంలో భూ రీ-సర్వే పనులను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే సమయంలో భూ యజమానుల నుంచి అవసరమైన వివరాలు, రికార్డులు, పత్రాలు సేకరించి, భూమి హద్దులను స్పష్టంగా గుర్తించాలని తెలిపారు. భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ-సర్వేను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ రీ-సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల భూ పత్రాలను పరిశీలించారు. పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అందుబాటులో ఉన్న భూ రికార్డులను సర్వే అధికారులకు అందజేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో తమ భూముల వాస్తవ హద్దులను చూపించి సర్వేకు సహకరించాలని సూచించారు.
రీ-సర్వే పూర్తయిన అనంతరం భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలు మరింత స్పష్టంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధార ప్రసాద్, సర్వేయర్లు వెంకన్న, కళ్యాణ్, లైసెన్స్ సర్వేయర్లు మధు, వంశీ, కవిత, జీపీఓ రాధా, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు దురదృష్టకరం


దీ=షా ఎమ్మెల్సీ తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలి: ద్యారపోగు వెంకటేష్



**సీకే న్యూస్ ప్రతినిధి, వనపర్తి జిల్లా**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి దీ=షా ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను వనపర్తి జిల్లా ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ద్యారపోగు వెంకటేష్ తీవ్రంగా ఖండించారు.
ఒక వ్యక్తిని అవమానించడం మాత్రమే కాకుండా రాజ్యాంగబద్ధమైన పదవిని, శాసనసభ గౌరవాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ స్థాయిలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
దళిత నాయకులను గౌరవిస్తున్నామని చెప్పడమే కాకుండా, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న దళిత నాయకుల గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవహరించాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. తాతా మధుపై వెంటనే కఠిన చర్యలు తీసుకుని, స్పీకర్ గౌరవంతో పాటు శాసనసభ ప్రతిష్ఠను కాపాడాలని కోరారు.

## ఆధార్ తరహాలో 'ఫార్మర్ ఐడీ : నమోదు చేసుకోవాలి

- రైతులకు వ్యవసాయ అధికారుల పిలుపు,




**సెప్టెంబర్ 08 (సీ కే న్యూస్) చేగుంట:** చేగుంట మండల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు ప్రతి రైతుకు ఆధార్ తరహాలో 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యతో కూడిన 'ఫార్మర్ ఐడీ' నమోదును తప్పనిసరి చేశారని, రైతులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతు భూమి రికార్డులు, ఆధార్, బ్యాంక్ ఖాతాలను అనుసంధానిస్తూ రూపొందిస్తున్న ఈ ఐడీ ఉంటేనే భవిష్యత్తులో పీఎం-కిసాన్, రైతు భరోసా, పంట రుణాలు, బీమా పరిహారం, సబ్సిడీలు మరియు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. రైతులు తమ ఆధార్ కార్డు, దానికి లింక్ అయిన మొబైల్ నంబర్, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్‌లతో గ్రామాల్లోని రైతు వేదిక వద్ద వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ద్వారా ఉచితంగా గానీ, లేదా సమీప మీ-సేవా కేంద్రాల్లో 15 రుసుము చెల్లించి గానీ తక్షణమే నమోదు పూర్తి చేసుకోవాలని, ఆలస్యం చేస్తే ప్రభుత్వ పథకాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## విద్యాభివృద్ధిపై వీసీపీసీ సమీక్ష.. సమష్టి కృషికి సర్పంచ్ నారియా నాయక్ పిలుపు...



**మల్దకల్ సెప్టెంబర్ 8:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పెద్ద తాండ గ్రామంలోని ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో పెద్ద తాండ గ్రామంలో వీసీపీసీ ఆధ్వర్యంలో పిల్లల విద్యాభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని సర్పంచ్ నారియా నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పిల్లల విద్యా పరిస్థితి, పాఠశాలల్లో వారి హాజరు, చదువుపై ఆసక్తి, విద్యా ప్రమాణాల మెరుగుదల వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.
పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సర్పంచ్ నారియా నాయక్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడడంతో పాటు, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.
గ్రామంలో విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తామని సర్పంచ్ తెలిపారు. పిల్లల విద్యకు గ్రామం మొత్తం అండగా నిలిస్తేనే మంచి ఫలితాలు సాధించగలమని ఆయన అన్నారు.
ఈ సమావేశంలో ఉప సర్పంచ్, గ్రామపంచాయతీ సెక్రటరీ, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొని పిల్లల విద్యాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామంలోని ప్రతి చిన్నారి చదువులో ముందంజలో ఉండేలా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని నిర్ణయించారు.

## ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

ధనియాలపాడు పంచాయతీలో సర్పంచ్ సనప సావిత్రి ఆధ్వర్యంలో కార్యక్రమం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సీకే న్యూస్ ప్రతినిధి,** ఇల్లందు సెప్టెంబర్ 8 : -
ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గౌరవనీయులు కోరం కనకయ్య గారి జన్మదినోత్సవం సందర్భంగా ధనియాలపాడు గ్రామపంచాయతీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ సనప సావిత్రి ఆధ్వర్యంలో ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పలకలు, బలపాలు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కోరం కనకయ్య గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు విద్యాసామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధనియాలపాడు సర్పంచ్ సనప సావిత్రి, ఉప సర్పంచ్ అంగోత్ ఆంజనేయులు నాయక్, గ్రామ అధ్యక్షులు జబ్బా అంజయ్య, గ్రామ పెద్దలు పటేల్ నర్సయ్య, వార్డు మెంబర్ కిన్నెర కిషోర్, ఉపాధ్యక్షులు తిప్పరపు ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సాంబ సీతక్క, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## టెస్టింగ్ పేరుతో అధిక శబ్దం -- డీజే సీజ్, యజమానిపై కేసు నమోదు

**సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాద్**
బోథ్ కేంద్రంలో డీజే యజమాని ఇర్షాద్ అలీపై కేసు నమోదు
డీజేతో పాటు వాహనం సీజ్
సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు
ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి
బోథ్ మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా టెస్టింగ్ పేరుతో అధిక శబ్దం వచ్చేలా డీజే ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన డీజే యజమాని ఇర్షాద్ అలీపై బోథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, డీజేతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. బోథ్ మండల కేంద్రంలో అధిక శబ్దంతో డీజే వినియోగిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా, నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో డీజేలు, సౌండ్ సిస్టమ్స్ వినియోగించడం వల్ల శబ్ద కాలుష్యంతో పాటు ప్రజా ప్రశాంతతకు భంగం కలుగుతుందని పేర్కొన్నారు. వృద్ధులకు పిల్లలకు గర్భిణీలకు ఆసుపత్రిలో చికిత్స పొందే వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు మరియు శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, టెస్టింగ్ పేరుతోనైనా అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు




తప్పవని డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి హెచ్చరించారు.
డీజే యజమానులు, నిర్వాహకులు నిబంధనలకు లోబడి మాత్రమే సౌండ్ సిస్టమ్స్ వినియోగించాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోథ్ సీఐ డి గురుస్వామి, ఎస్ఐ వి పురుషోత్తం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యంగా సర్పంచ్ కె.భగవంత్ సేవలు. యూనిఫామ్ దుస్తుల పంపిణీ..




**మల్దకల్ సెప్టెంబర్ 8:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం కుర్తిరావులచెరువు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ కె.భగవంతుడు ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫామ్ దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కె.భగవంతుడు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులకు యూనిఫామ్ దుస్తులను అందజేశారు.
ఈ సందర్భంగా సర్పంచ్ కె. భగవంతుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. గ్రామంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు విద్యలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. యూనిఫామ్ దుస్తులు అందుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి సర్పంచ్ చేస్తున్న కృషిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల పరిరక్షణ కమిటీ సమావేశం.

మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల భద్రతపై అవగాహన...



**మల్దకల్ సెప్టెంబర్ 08:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎల్కూర్ గ్రామంలో మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశాన్నినిర్వహించారు. గ్రామ సర్పంచ్ పి. వినోద్ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి సుభావతి సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ, వారి హక్కులు, భద్రత, సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. బాలలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బాలల భద్రతకు గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గ్రామంలో బాలల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతూ, వారికి ప్రభుత్వం అందించే పథకాలు, సేవలు సక్రమంగా అందేలా కృషి చేస్తామని సర్పంచ్ వినోద్ కుమార్ తెలిపారు. బాలల పరిరక్షణ కోసం కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో నిరంతరం పనిచేస్తారని పేర్కొన్నారు.

## డబ్బులు ఇవ్వలేదని వ్యక్తిపై దాడి చేసి ద్విచక్ర వాహనం అపహరణ చేసిన ట్రాన్స్‌జెండర్ అరెస్ట్, రిమాండ్




**బలవంతపు వసూళ్లకు పాల్పడిన ట్రాన్స్‌జెండర్**
**బాధితుని ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు**
**వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ బి సునీల్ కుమార్**

**సికె.న్యూస్.ప్రతినిధి.ఆదిలాబాద్**
ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌక్ వద్ద డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తిపై దాడి చేసి, అతని ద్విచక్ర వాహనాన్ని అపహరించిన కేసులో ఒక నిందితుడిని (ట్రాన్స్‌జెండర్) ను వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు.
శాంతినగర్‌కు చెందిన తునికి సంతోష్ సెప్టెంబర్ 1న రాత్రి తన సహచరుడితో కలిసి ఎన్‌టీఆర్ చౌక్ వద్ద ఓ పరిచయస్తుడితో మాట్లాడుతుండగా, ఒక ట్రాన్స్‌జెండర్ వ్యక్తితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు అక్కడికి వచ్చి డబ్బులు ఇవ్వాలని కోరారు. సంతోష్ డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో ట్రాన్స్‌జెండర్ వ్యక్తి మొదట అతనిపై దాడి చేయగా, మరో ఇద్దరు వ్యక్తులు కూడా అతనిని కొట్టారు. భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయిన అనంతరం నిందితులు(ట్రాన్స్ జెండర్) బాధితుని ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లారు.
ఈ ఘటనపై బాధితుడు సెప్టెంబర్ 7న పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, సుమారు రూ.1 లక్ష విలువైన ద్విచక్ర వాహనం అపహరణకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
దర్యాప్తులో భాగంగా ఘా-1 సిమ్రాన్ ఖాన్ ఏ సోయాఫ్ ఖాన్(25), ఆదిలాబాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఘా-2 ఫైజల్ (బంగారిగూడ గ్రామం), ఘా-3 సమీర్ (భగత్‌సింగ్ నగర్, ఆదిలాబాద్) పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నమోదు చేసి తదుపరి చట్టపరమైన దర్యాప్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు..

## పసిడి బాల్యం.. ఆటపాటలతో అభ్యసనం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాదు:** పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తూ, అభ్యసనాన్ని ఆనందభరితంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లాలో నూతనంగా ప్రారంభించిన 74 ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో ఆటపాటల ద్వారా విద్యాబోధన అందించేలా వినూత్న అభ్యసన సామగ్రిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

మంగళవారం మావల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రీ-ప్రైమరీ పాఠశాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇండోర్, అవుట్‌డోర్ ఆట వస్తువులు, డ్యాన్స్, పాటల కోసం మైక్ సెట్లు, ఊయలలతో పాటు చిన్నారులను ఆకట్టుకునేలా రూపొందించిన అభ్యసన సామగ్రిని పరిశీలించారు. వీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ బోధనను మరింత మెరుగుపరచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

అనంతరం చిన్నారులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మణ్, జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, పీఎంఓ మానిటరింగ్ అధికారి లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలకు తప్పనిసరి అనుమతులు: ఎస్సై శ్రీకాంత్ రెడ్డి.




**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు సెప్టెంబరు 8.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ: వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని వలిగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సూచించారు.

గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగా పోలీస్ శాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు.

మండపాల ఏర్పాటు సందర్భంగా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మండపాల వద్ద విద్యుత్ వైరింగ్, అగ్నిప్రమాదాల విషయంలో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.మండపాల వద్ద అసభ్యకరమైన కార్యక్రమాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.డీజేలు, మైక్‌ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

గణేష్ నిమజ్జన శోభాయాత్రకు కూడా ముందస్తు అనుమతులు తీసుకుని, పోలీసులు సూచించిన మార్గాల్లోనే నిర్వహించాలని తెలిపారు. శోభాయాత్ర సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా నిర్వాహకులు సహకరించాలని కోరారు.

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించి శాంతిభద్రతలను కాపాడాలని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయడం లేదా నిబంధనలను ఉల్లంఘించడం జరిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

కావాలంటే దీనిని.

## ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**సి కే న్యూస్,పాలకుర్తి :** రాయపర్తి మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఎన్నికైన మండల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శులతో పాటు నూతన కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. నూతన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న సంఘం సభ్యులను అభినందించారు. సమాజ సేవలో ఆర్యవైశ్య సంఘం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

గ్రామాలకు సేవలు విస్తరిస్తాం

రాయపర్తి మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా పుల్లూరు దామోదర్, ఉపాధ్యక్షుడిగా ఉకల్ గ్రామానికి చెందిన తేరాల మధు ఎన్నికయ్యారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తేరాల మధు మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం తరపున అందుబాటులోకి వచ్చే నిధులను మండలంలోని ప్రతి గ్రామంలోని ఆర్యవైశ్య కుటుంబాలకు ఉపయోగపడేలా ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తామని తెలిపారు. సంఘ సభ్యుల సంక్షేమంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు సంఘ నాయకులు, సభ్యులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య కుటుంబాలు పాల్గొన్నాయి.

# ఉమ్రి గ్రామంలో 'పోలీసులు మీకోసం' కార్యక్రమం.

- తలమడుగు, దేవాపూర్ గ్రామాలలో 26 సీసీటీవీ కెమెరాల ప్రారంభం.
- ఉచితంగా వైద్య సిబ్బందిచే మెడికల్ క్యాంపు ఏర్పాటు.
- గంజాయిపై యుద్ధం చేయాలి.. మార్పు ద్వారానే గంజాయిని దూరం చేయవచ్చు.
- గంజాయి పండించే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేసేలా సంబంధిత శాఖలకు సిఫార్సు.
- 15 మంది వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ.. గ్రామస్తులకు వాలీబాల్ కిట్స్ అందజేత.
- మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్ ప్రదానం.
- క్రీడాకారులతో కబడ్డీ ఆడి, వారిని ఉత్సాహపరిచారు.
- ఆకట్టుకున్న ఆదివాసి ల డెంస నృత్య సాంస్కృతిక కార్యక్రమాలు
- పాల్గొన్న సుమారు 250 మంది గ్రామ ప్రజలు, యువత.
- గ్రామస్తులతో కలిసి సామూహిక భోజన కార్యక్రమంలో పాల్గొన్న
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్




**సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్ :** ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం, గ్రామాల్లో పోలీసు-ప్రజల సత్సంబంధాలను బలోపేతం చేయడం, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం తలమడుగు మండలం ఉమ్రి గ్రామంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్రి గ్రామ ప్రజలు సాంప్రదాయ ఆదివాసి డేంశ నృత్యంతో జిల్లా ఎస్పీని ఘనంగా ఆహ్వానించారు, గ్రామ మహిళలు జిల్లా ఎస్పీకి రాఖిని కట్టి రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో ఉన్న కుమురం భీం విగ్రహానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఉమ్మడి గ్రామంలో ఏర్పాటు చేసిన "పోలీసులు మీకోసం" కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ఎస్పీతో పాటు పోలీసు అధికారులకు గ్రామ మహిళలు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవాపూర్ మరియు తలమడుగు గ్రామాలలో ఏర్పాటు చేసిన 26 సీసీటీవీ కెమెరాలను గ్రామస్తులతో కలిసి జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ప్రతి గ్రామం సీసీటీవీ నిఘాలో ఉంటే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని అన్నారు. గ్రామ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, సీసీటీవీలు ప్రజల రక్షణకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటూ సీసీటీవీల ఏర్పాటుకు సహకరించిన గ్రామ పెద్దలు, గ్రామ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామ ప్రజలు, యువతకు అవగాహన కల్పించారు. "గంజాయిపై యుద్ధం చేయాలి.. మార్పు వల్లే గంజాయిని సమాజం నుంచి దూరం చేయవచ్చు" అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

గ్రామాల్లో ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నా లేదా మాదకద్రవ్యాల వ్యాపారం నిర్వహిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, గంజాయి రహిత సమాజ నిర్మాణమే జిల్లా పోలీసుల లక్ష్యమని తెలిపారు. చదువు పట్ల ఉన్న ఆవశ్యకతను తెలియజేశారు విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి అని తెలిపారు. చదువు వల్ల భవిష్యత్తు మారుతుందని తెలిపారు. నకిలీ బాబాలను, మంత్రాలను తంత్రాలను ఎలాంటి వైద్య అవసరం ఉన్న, ప్రభుత్వం గుర్తించిన ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను సంప్రదించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 15 మంది వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. కోసాయి విజయ హనుమాన్ టెంపుల్ లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

**గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ప్రారంభించారు.**

దాదాపు ఆరు రంగాలలో నిష్ణాతులైన ఆదిలాబాద్ లోని ప్రైవేటు వైద్యుల బృందం చే గ్రామస్తులందరికీ ఉచితంగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగిందని ఈ క్యాంపులో 250 మంది గ్రామస్తులు పాల్గొని జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఆప్తమాలజీ, డెంటల్, పీడియాట్రిషన్ విభాగాలలో వైద్య పరీక్షలను ఉచితంగా మందులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోసాయి, జరీ, ఉమ్రి గ్రామాలకు చెందిన 250 మంది గ్రామస్తులు మహిళలు వృద్ధులు చిన్నారులు పాల్గొని వైద్య పరీక్షలను చేయించుకున్నారు.

**మండల స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు.**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని, క్రీడలు క్రమశిక్షణ, ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు జిల్లా ఎస్పీ నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారులతో కాసేపు కబడ్డీ ఆడి వారిని ఉత్సాహపరిచారు.

**విజేతలు :**

ప్రథమ బహుమతి : కోసాయి గ్రామ జట్టు -- 5 వేల నగదు బహుమతి, ట్రోఫీ.

ద్వితీయ బహుమతి : ఝరి గ్రామ జట్టు -- 3 వేల నగదు బహుమతి, ట్రోఫీ.

తృతీయ బహుమతి :

పాల్సి కె గ్రామ జట్టు, 2 వేల నగదు బహుమతి, ట్రోఫీ.

ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, తలమడుగు ఎస్ఐ డి రాధిక, పట్టణ డాక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, శిల్పా సందీప్, అనిషా, భార్గవ్ కృష్ణ, శ్రీనివాసచారి, ఉమ్రి సర్పంచ్ మెస్రం సావిత్రిబాయి, కోసాయి గ్రామ సర్పంచ్ శైలజ, గ్రామ పెద్దలు పెందూరు వనమాల, కుమ్ర రామారావు, పెందూరు మాధవరావు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, యువతతో పాటు సుమారు 250 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసే అధికారం ఎవరిచ్చారు

- మహిళా ఎమ్మెల్యేల పై దాడి అప్రజాస్వామికం
- మహిళా ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటి
- వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రజల అవస్థలు



**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ కేశంపేట ప్రతినిధి సెప్టెంబర్ 08:** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసే అధికారం ఎవరిచ్చారుని మాజీ మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకురాలు ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద మహిళ ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేల పై దాడి అప్రజాస్వామికమన్నారు.

రాష్ట్రంలో మహిళా ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రజల అవస్థలు పడుతున్నారని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి, ఇచ్చిన హామీలను అమలు చేయమని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నార

## కొత్తూరు మండల ఎస్సీ సెల్ నూతన కమిటీ నియామకం,



- పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి,
- కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి,

**జ్ఞాన తెలంగాణ,కొత్తూరు,షాద్ నగర్ ప్రతినిధి,సెప్టెంబర్ 08:** పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు కొత్తూరు మండల ఎస్సీ సెల్ గా పెంటన్నోళ్ల ఆంజనేయులు మైలారం దయాకర్ ఉపాధ్యక్షులు గా కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి నియమించారు ఈ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు నూతనంగా నియమితులైన ఉపాధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పార్టీ సిద్ధాంతాలు కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు మండలంలోని నాయకులు కార్యకర్తలతో కలిసి సమష్టిగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అంబటి ప్రభాకర్, హరినాథ్ రెడ్డి,సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎర్రోళ్ల జగన్,గూడూర్ సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా, రవికుమార్ గుప్తా,శివశంకర్ గౌడ్, సురేష్ గౌడ్,దర్శన్,సాయిలు, బాలు ముదిరాజ్,శంకర్ నాయక్,

## కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు

**ఏన్కూరు పీఎస్‌లో బీఆర్ఎస్ నేత గిరిబాబు ఫిర్యాదు**




**సీకే న్యూస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు సెప్టెంబర్ 09 2026:** మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే కే. శంకరయ్యలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఏన్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎల్. గిరిబాబు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు సమర్పించారు. కేసీఆర్ నివాసం వద్ద జరుగుతున్న నిరసనలపై స్పందిస్తూ ఎమ్మెల్యే శంకరయ్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం కేసీఆర్‌పై ఇదే తరహాలో వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ప్రతిపక్ష నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని గిరిబాబు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ కార్యకర్తలను భౌతిక దాడులకు ప్రేరేపించేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కావున భారతీయ న్యాయ సంహిత పరిధిలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని పోలీసులను కోరారు. అలాగే కేసీఆర్ నివాసం వద్ద భద్రతను మరింత పెంచాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ పై,తాతా మధు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాష్ట్ర దళితులను అవమానించినట్టు

- మెదక్ జిల్లా జనరల్ సెక్రెటరీ రాజా గౌడ్



**సెప్టెంబర్ 08 సీ కే న్యూస్ చేగుంట :**రెండు సంవత్సరాలు అయిపోయింది ప్రజలు కేసీఆర్ పాలన పక్కకు పెట్టి అధికారం పోతే ప్రజలు మిమ్మల్ని పక్కకు పెడితే గిలగిలా కొట్టుకుంటున్నారు సహనం కోల్పోతున్నారు ప్రెస్టేషన్లో ఉన్నారు అధికారం ఉంటేనే బయటకు వస్తాడా కేసీఆర్ ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే ప్రతిపక్ష పాత్ర పోషించకుండా ఫామ్ హౌస్ లో కూర్చుని కుటిల బుద్దులు కుట్రలు కుతంత్రాలు ఇదే మీ తీరా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కుకు మీరు ఇచ్చే విలువ ఇదా ప్రజల పక్షాన అసెంబ్లీకి రావద్దా ప్రభుత్వ వైఫల్యం ఉంటే మాట్లాడవద్దా దమ్ముంటే అసెంబ్లీకి రమ్మను కేసీఆర్ ని అప్పుడు మీరు మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవచ్చు ఇక మీ గురించి కొన్ని విషయాలు దళిత బంధు అనే పథకం పెట్టారు కేసీఆర్ అది దళితుల మీద ప్రేమతో కాదు కేవలం హుజరాబాద్ లో ఈటెల రాజేందర్ ని ఓడగొట్టటానికి 58,000 వేల దళిత ఓట్లు అక్కడ ఉన్నాయి అందుకోసం దళిత బంధు పథకం అని తీసుకువచ్చి డ్రామాలు ఆడినాడు సరే తర్వాత రాజేందర్ గారు గెలిచారు ఆ కథ అక్కడికి అయిపోయింది కేసీఆర్ ఫెయిల్ అయ్యాడు తర్వాత దళిత బంధు ఎవరికి ఇచ్చాడు గ్రామానికి ఒకరికి టిఆర్ఎస్ కార్యకర్తకు ఇచ్చారు ఇప్పుడు చెప్పండి నిజంగా అది దళితుల మీద ప్రేమతో ఇచ్చిన పథకమా లేక ఏంటి అనేది మీకే వదిలిపెడుతున్నాను రెండవది డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కచ్చితంగా ఇస్తాను అన్నాడు అల్లుడు వస్తే బిడ్డ వస్తే ఎక్కడ ఉంటారు మేక కోడి ఎక్కడ ఉంటుంది అని కాకమ్మ కథలు చెప్పాడు ఎంతమందికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చాడు మన మండలంలో ఎన్ని గ్రామాలకు ఇచ్చారు చెప్పండి అదే ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం లేదు ప్రతి గ్రామంలో రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇల్లు ఉన్నది పార్టీలకు అతీతంగా ఇది మీకు మాకు తేడా మీవి మాయమాటలు మావి చేతల్లో చూపెట్టే పనులు మరొకటి కెసిఆర్ రైతు బంధువు అని గొప్పగా చెప్పుకునే మీకు నా సూటి ప్రశ్న గుట్టలకు చెట్లకు బండలకు చెరువులో ఉన్న భూములకు పరిశ్రమలకు వాటి స్థానంలో ఉన్న భూములకు రైతుబంధు ఇచ్చి రాష్ట్రాన్ని ఆర్థికంగా సర్వనాశనం చేసి అప్పులపాలు చేశారు, అదే కాంగ్రెస్ పార్టీ నిజమైన రైతులకు సాగు చేసే రైతులకు సాగు భూములకు మాత్రమే రైతు భరోసా ఇచ్చి రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తుంది మరొకటి ఈ రాష్ట్రంలో అర్హులైన వారి అందరికీ రేషన్ కార్డులు ఇచ్చి పేదవారు కూడా మనతో సమానంగా సన్నబియ్యం తినాలని సన్న బియ్యం ఇస్తుంది కాంగ్రెస్ పార్టీ మీకు ఎప్పుడైనా పేదవారికి సన్న బియ్యం ఇవ్వాలన్న ఆలోచన వచ్చిందా మరొకటి పేదవారికి ఆర్థిక భారం పడకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల గృహ వినియోగ ఉచిత విద్యుత్ అందిస్తుంది కాంగ్రెస్ ఇలాంటి ఆలోచన మీకు ఎప్పుడైనా వచ్చిందా మరొకటి రాష్ట్రంలో ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ సుమారు 20వేల కోట్ల అతిపెద్ద రుణమాఫీ చేసింది కాంగ్రెస్ పార్టీ మీరు పరిపాలించిన సమయంలో ఎంతమందికి రుణమాఫీ చేశారు ఎన్నిసార్లు చేశారు మీరు చేసిన రుణమాఫీ వడ్డీలకే పోయింది ఇది మీకు మాకు తేడా ప్రజలు మీ అహంకార పరిపాలన చూసి ఓటుతో బుద్ధి చెప్పి పక్కకు పెట్టేసిన తర్వాత కూడా మీ అహంకారం తగ్గడం లేదు అంటే ఇంకొకసారి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వరు గుర్తుపెట్టుకోండి ప్రజలు చాలా గొప్ప వాళ్ళు అన్ని గమనిస్తారు అన్ని గమనిస్తున్నారు టిఆర్ఎస్ 10 సంవత్సరాల ప్రభుత్వంలో చేసిన ఘోరాలు నేరాలు చాలా ఉన్నాయి ఇంకా చెప్తాము మీ చేతుల్లో మహా మేధావులు గొప్ప గొప్ప నాయకులు నిజమైన కార్యకర్తలు చాలా చాలా మోసపోయారు అందరిని మోసం చేయడంలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు ఆస్కార్ అవార్డుకు గ్రహీతలు అనే సత్యం దేశం అంతటా తెలుసు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలు కోరుకున్న ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చే పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే. జై కాంగ్రెస్ జైజై కాంగ్రెస్

## మీాజ తాతా మధుసూదన్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం: దర్శ బాలకృష్ణ




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజల గొంతుకగా నిలుస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ని హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి న్యాయ కస్టడీకి తరలించడం అప్రజాస్వామిక చర్య అని చింతకాని మండలం దీ=హా పార్టీ ఉద్యమ నాయకులు దర్శ బాలకృష్ణ తీవ్రంగా ఖండించారు.
ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై కేసులు, అరెస్టులతో అణచివేతకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి ముప్పని అన్నారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను, ప్రశ్నించే గొంతులను అణచివేయలేరని స్పష్టం చేశారు.
తాతా మధుసూదన్ ని వెంటనే భేషరతుగా విడుదల చేయాలని, ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకు స్వస్తి పలకాలని దర్శ బాలకృష్ణ డిమాండ్ చేశారు.

# ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేదు...

**మంత్రులు వచ్చారు.. గద్వాల జిల్లాకు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి...**

**గద్వాల సెప్టెంబర్ 8 :**గద్వాల కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం గద్వాల పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కదాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు వెయ్యి రోజులు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు.
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఏమైందని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మహిళల కోసం ఇచ్చిన ఇతర హామీలను ఎన్ని అమలు చేశారో ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.గద్వాల జిల్లాకు మంత్రులు పలుమార్లు వచ్చినప్పటికీ జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని బాసు హనుమంతు నాయుడు ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.
కేసీఆర్, కేటీఆర్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కొత్తూరు కాంగ్రెస్ పార్టీ మండల్ బిసి సేల్ అధ్యక్షుడిగా పెండ్లిమడుగు అరవింద్ గౌడ్




- కష్టపడి పని చేసే కాంగ్రెస్ పార్టీ లో ముందడుగు
- గ్రామ కార్యకర్త నుంచి మండల బీసీసెల్ అధ్యక్షుడు వరకు పెండ్లిమడుగు అరవింద్ గౌడ్
- కొత్తూర్ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో
- గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్త ఆధ్వర్యంలో బీసీ సెల్ అధ్యక్షుడిగా నియామకం

**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 08 :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొత్తూరు మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తూరు మండల బిసి సేల్ అధ్యక్షుడిగా పెండ్లి మడుగు అరవింద్ గౌడ్ ని నియమించారు ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు, గుండెల శేఖర్ వర్కింగ్ అధ్యక్షుడు అంబటి కృష్ణయ్య ప్రధాన కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ కార్యదర్శి గుండమోని శ్రీశైలం సహాయ కార్యదర్శి కాట్న జగదీష్ కోశాధికారి లింగారం రఘు గౌడ్ కార్యవర్గ సభ్యులను బావట్ల మురళి గొడుగు శేఖర్ నియమించారు.పెండ్లిమడుగు అరవింద్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసేవారికి ఫలితం ఉంటుంది అన్నారు ఒక గ్రామ కార్యకర్త నుంచి ఈరోజు మండల బీసీ సేల్ అధ్యక్షుడి వరకు కొత్తూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి అధ్వర్యంలో ఎన్నుకున్నందుకు ఎంతో ఆనందం ఉందని అన్నారు రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు ముందడుగు ఉంటానని అన్నారు ప్రజా పాలన ప్రభుత్వం కాబట్టి ప్రజలకు సేవ చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీలో నిరంతరం కష్టపడుతానని నాకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించుకుంటానని ఈ కార్యక్రమంలో నిరంతరముగా సేవ చేస్తానని అరవింద్ గౌడ్ కొనియాడారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నా కొత్తూరు కాంగ్రెస్ మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ గూడూరు గ్రామ సర్పంచ్ దయానంద గుప్తా గూడూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కల్వకోలు సిద్ధులు గౌడ్ వార్డ్ మెంబర్ వార్డ్ మెంబర్ దేవేందర్ గట్టు లక్ష్మి చంద్రయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు అరవింద్ గౌడ్ కు శాలలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియ చేశారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ ఎస్సీ సెల్



**తాతా మధుసూదన్‌పై చర్యలు తీసుకోవాలని చింతకాని ఎస్సైకి ఫిర్యాదు**

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని, సెప్టెంబర్ 7: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు తీవ్రంగా ఖండించారు.
రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని నాయకులు పేర్కొన్నారు. దళిత నాయకుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలని సూచించారు.
తాతా మధుసూదన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చింతకాని ఎస్సై జి. నరేష్‌కు ఫిర్యాదు చేశారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వనం చిన్నప్ప, జిల్లా కార్యదర్శి కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున, కంచం కోటేశ్వరరావు, చాట్ల చంద్రం, తడికమళ్ళ రమేష్, సిర్ర సుబ్బయ్య, గురవయ్య, లంజపల్లి శీను తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌పై అవగాహన సదస్సు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**పాతర్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామ సర్పంచ్ ఓబినబోయిన లక్ష్మీ అచ్చయ్య గారి ఆధ్వర్యంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం నిర్మల మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దారెల్లి సురేష్, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దివంగ నేత రామలింగ రెడ్డి,ఆశయాల సాధన కోసమే,

- సుజాత సంచలన నిర్ణయం, మారనున్న పరిమాణాలు దుబ్బాక లో వార్ సై




**సెప్టెంబర్ 08 (సీ కే న్యూస్) చేగుంట :**దివంగనేత సోలిపేట రామలింగారెడ్డి మరియు సుజాత పూర్తి చరిత్ర : దుబ్బాక రాజకీయాలకు ఇదే మూలం:దివంగత సోలిపేట రామలింగారెడ్డి : చరిత్ర
ఆయన ప్రస్థానం సాధారణంగా మొదలు కాలేదు:
మొదట జర్నలిస్ట్: సిద్దిపేటలో ఒక తెలుగు పేపర్లో 20 ఏళ్లకు పైగా జర్నలిస్ట్ గా పనిచేశారు. అప్పుడే సిద్ధిపేట ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ తో సన్నిహిత సంబంధం ఏర్పడింది.
తెలంగాణ ఉద్యమం: కేసీఆర్ పిలుపుతో జర్నలిజం వదిలి, 2001లో టిఆర్ఎస్ పార్టీ స్థాపించినప్పటి నుండే ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. 1990లోనే టడచట్టం కింద అరెస్ట్ కూడా అయ్యారు. 08బి1
రాజకీయ విజయాలు (4 సార్లు ఎమ్మెల్యే)
2004 ఒ 2008 (దొమ్మాట) టీఆర్ఎస్ తరపున గెలిచారు.
2008లో కేసీఆర్ పిలుపుతో రాజీనామా చేసి మళ్ళీఉపఎన్నికలో గెలిచి సంచలనం సృష్టించారు,
2014 ఒ 2018 (దుబ్బాక) వరుసగా రెండుసార్లు భారీ మెజారిటీతో గెలిచారు. 2014లో 37,925 ఓట్లతో, 2018లో ఏకంగా 62,500 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. చనిపోయేనాటికి అసెంబ్లీ అంచనాల కమిటీ చైర్మన్ గా ఉన్నారు. ఈ3బి0
కేసీఆర్ కి అత్యంత నమ్మకమైన, సొంత జిల్లా నేతగా ఆయనకు పేరు
బిఆర్ఎస్ పార్టీకి దుబ్బాకలో మొదలెక్కడ,
బిఆర్ఎస్ (అప్పటి) టీఆర్ ఎస్) కి దుబ్బాక కంచుకోట.
2004 : రామలింగారెడ్డి దొమ్మాట నుండి టిఆర్ఎస్ తరపున గెలవడంతోనే బిఆర్ఎస్ జెండా దుబ్బాకలో మొదటిసారి ఎగిరింది,
తర్వాత 2008, 2014, 2018 వరుస విజయాలతో దుబ్బాకను టిఆర్ఎస్ అడ్డాగా మార్చారు.
బ్రేక్ ఎక్కడ పడింది, 2020లోరామలింగారెడ్డి చనిపోవడంతో వచ్చిన ఉప ఎన్నికలో టీఆర్ఎస్ ఓడిపోవడం ఇదే బిఆర్ఎస్ కి మొదటి ఎదురుదెబ్బ.
సోలిపేట సుజాత రాజకీయ ప్రస్తానం,
ఆమె రామలింగారెడ్డి సతీమణి.
ఎంట్రీ భర్త మరణం తర్వాత 2020 నవంబర్ లో జరిగిన దుబ్బాక ఉపఎన్నికలో బిఆర్ఎస్ ఆమెకు టికెట్ ఇచ్చింది.
ఫలితం, బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు చేతిలో కేవలం 1,079 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు,
ప్రస్తుతం: ఓటమి
తర్వాత కూడా బిఆర్ఎస్ పార్టీలోనే యాక్టివ్ గా ఉన్నారు. వారి కుమారుడు సోలిపేట సతీష్ రెడ్డి
బిఆర్ఎస్ యువజన విభాగంలో రాష్ట్ర నాయకుడిగా ఉన్నారు,
2028 ఎన్నికలో బిఆర్ఎస్ పార్టీ నుండి బరిలో దిగనున్న సోలిపేట సుజాత రామలింగారెడ్డి

# ఎల్ ఓ సి అందజేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీను

- కాంగ్రెస్ పార్టీ పేదల ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ
- 1,00,000/- ఎల్ ఓ సిలి అందచేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్...
- పాల్గొన్న అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ గోపాల్ రెడ్డి మరియు సీనియర్ కాంగ్రెస్ నేత భరత్ రెడ్డి...



**సి కె న్యూస్ ప్రతినిధి** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామంలో నివసిస్తున్న పి సురేష్ కూతురు చిన్నారి నిషిక అనారోగ్యంతో హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ ఆర్థిక వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో గ్రామంలోని సర్పంచ్ గోపాల్ రెడ్డి మరియు భరత్ రెడ్డి గార్ల సహకారంతో గౌరవ శాద్నగర్ శాసన సభ్యులు శ్రీ వీర్లపల్లి శంకర్ అన్న గారి ఉదారగుణం చిన్నారికి 100000/- రూపాయల ఎల్ ఓ సి అందజేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్.

రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ మన నియోజకవర్గంలోని ఏ ఒక్కరు కూడా అనారోగ్యంతో బాధపడకూడదని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరుకున్నారు. ఎవరికైనా ఆరోగ్య నిమిత్తం పేద ప్రజలు నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఎంతోమంది శంకరన్న గారి ఆధ్వర్యంలో ఎల్ ఓ సి లు అందుకున్నారని ఆయన అన్నారు.. ఈ ప్రభుత్వం పేదలకు అందుబాటులో ఉంటుందని, నిత్యం షాద్ నగర్ ప్రజల గురించి పరితపించే మన మీూా శంకరన్న మనకు దొరకడం మన అదృష్టం అని ఆయన అన్నారు... జవీ రేవంత్ రెడ్డి గారి ప్రజా పాలన రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుందని, రాష్ట్రంలోని ప్రతి పేదవారికి మరియు అర్హులందరికీ ప్రజా పాలనలోని పథకాలు అందుతున్నాయని ఆయన అన్నారు...

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, సింగిల్విండో వైస్ చైర్మన్ తుపాకుల శేఖర్ ముదిరాజ్, కేశంపేట అధ్యక్షులు రమేష్, మాజీ ప్రెసిడెంట్ హరినాథ్ రెడ్డి,అయ్యవారిపల్లె సర్పంచ్ గోపాల్ రెడ్డి, భరత్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, మాధవులు, ప్రసాద్, జంగయ్య, గంగారాం, జంగారి రవి మరియు యాదగిరి తదితరులు పాల్గొన్నారు

## నాగిలిగొండ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన గ్రామ కాంగ్రెస్ పార్టీ.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం నాగులుగొండ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పగడాల రామకృష్ణమూర్తి.

గ్రామానికి చెందిన చాట్ల నర్సమ్మ కు 37 వేల రూపాయలు, ం౨. ఉస్సేన్ కు 23,500,భోజడ్ల. చైతన్య 22,500, రూపాయలు కోపుల విజయరానికి 15000 రూపాయలు మంజూరు చేసినారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి సిఫారసు మేరకు మంజూరైన చెక్కులను పంపిణీ చేసిన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పగడాల రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు సాట్ల రాజశేఖర్, మాజీ సర్పంచ్ జమ్ముల కృష్ణారెడ్డి జోనల్ సభ్యుడు పంది మురళి కృష్ణ, కిసాన్ సెల్ అధ్యక్షుడు కిసాన్ సెల్ అధ్యక్షుడు మద్దిని లక్ష్మయ్య. జమ్ముల అశోక్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులుమరియు నాయకులు వార్డు నెంబర్లు వివిధ అనుబంధ సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

చెక్కులను తీసుకున్న లబ్ధిదారులు గౌరవ ఉపముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేసినారు.

## వినాయక చవితి సందర్భంగా ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ

బిఆర్ఎస్ నివేజిక వర్గ యువ నాయకులు పిలుట్ల రఘు




**హుజూర్నగర్ సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్** గుగులోతు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పిల్లుట్ల రఘు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. హుజూర్నగర్ నియోజకవర్గం వ్యాప్తంగా ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు, యువతకు ఉచితంగా వినాయక విగ్రహాలు పంపిణీ చేయడం జరుగుతుంది.విగ్రహాలు కావాల్సిన కార్యకర్తలు, యువత తప్పనిసరిగా ముందుగా బుక్ చేసుకోగలరు.బుకింగ్ కోసం:

ఈరోజు నుండి సెప్టెంబర్ 10వ తేదీ మధ్యాహ్నం వరకు మాత్రమే కాల్ చేసి

మీ పేరుగ్రామంచిరునామా

దయచేసి ఈ నెంబర్ కి కాల్ చేసి మరియు వాట్సాప్ ద్వారా మీ వినాయక విగ్రహాన్ని బుక్ చేసుకోగలరు.

కాకు నూరి శివారెడ్డి. 8106249306

ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా 300కు పైగా ఉచిత వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుంది.

కావున హుజూర్నగర్ నియోజకవర్గ యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని

మీ పిల్లుట్ల రఘుబిఆర్ఎస్ పార్టీ నాయకులు

హుజూర్నగర్ నియోజకవర్గ ఒక ప్రకటనలో కోరారు

# నిబద్ధత గల కమ్యూనిస్టు బక్కిరెడ్డి



- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి
- బక్కిరెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని, సెప్టెంబర్ 8:** పార్టీ ఇచ్చిన పిలుపును తూచా తప్పకుండా అమలు చేస్తూ, జీవితాంతం ఎర్రజెండాను మోస్తూ కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమైన నిబద్ధతగల కమ్యూనిస్టు నాయకుడు అవులూరి బక్కిరెడ్డి అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు.

చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు అవులూరి బక్కిరెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా సోమవారం రాత్రి బక్కిరెడ్డి స్మారక స్థూపం వద్ద సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు.

**ప్రజా సమస్యలే ఎజెండాగా పనిచేశారు**

ఈ సందర్భంగా జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కోమట్లగూడెం గ్రామ అభివృద్ధిలో బక్కిరెడ్డి పాత్ర ఎనలేనిదని అన్నారు. నిత్యం ప్రజా సమస్యలనే తన ఎజెండాగా చేసుకుని పనిచేసేవారని గుర్తుచేశారు. పార్టీ కార్యకర్తలు ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే వారికి అండగా నిలిచి, సంబంధిత నాయకుల వద్దకు తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని తెలిపారు.

బతికినంతకాలం ఎర్రజెండాను ఎత్తుకుని పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. కోమట్లగూడెం, చింతకాని ప్రాంతాల్లో కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం కావడంలో బక్కిరెడ్డి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.

**పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన నాయకుడులి**

మాజీ సర్పంచ్ వేమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి చురుగ్గా తీసుకెళ్లేవారని జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా, మండల కార్యవర్గ సభ్యుడిగా పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. బక్కిరెడ్డి కుటుంబానికి సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.పలువురు నాయకుల నివాళులు

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వేముల జానకిరాములు, శాఖ కార్యదర్శి అవులూరి రామిరెడ్డి, నాయకులు వేమిరెడ్డి కృష్ణారెడ్డి, అవులూరి పెద్ద రామిరెడ్డి, శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు అవులూరి వెంకట్రామిరెడ్డి, రాయల పెద్ద శ్రీను, నాగభూషణం, బక్కిరెడ్డి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# 18 న మహా ధర్నా ను విజయవంతం చేయండి-తుడుం దెబ్బ పిలుపు

కొత్తగూడ మండల కేంద్రం లో కరపత్రం ఆవిష్కరణ

జాబితా నుండి లంబాడి లను తొలిగించుటకు కమిషన్ నియమించాలి-తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్

**సికె న్యూస్ ఆగష్టు 8 మహబూబాబాద్ జిల్లా (పతినిధి:దుర్గం మురళి** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లో ఆదివాసీ ఆత్మ గోషా కరపత్రం ఆవిష్కరణ చేయడం జరిగింది అనంతరం తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్, జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ

సెప్టెంబర్ 18 న తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఇంద్ర పార్క్ లో ఆదివాసీ ఆత్మ గోషా మహా ధర్నా కార్యక్రమం షెడ్యూల్ తెగల జాబితా నుండి (ూ ల నుండి) లంబాడి లను తొలిగించుటకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కమిషన్ నియమించాలని ఇంద్ర పార్క్ వద్ద జరుగు మహ ధర్నా ను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ, ఆధార్ సొసైటీ, ూజుఔజూ సంఘాలు పిలుపునిస్తున్నాయితెలంగాణ రాష్ట్రంలో భారత రాజ్యాంగానికి విరుద్ధంగా లంబాడీలను ూ జాబితాలో చేర్చడంతో రాజస్థాన్ లో ూజ,మహారాష్ట్రలో ఉన్న బీసీలు, కర్ణాటకలో ఉన్న ఎస్సీలు విపరీతంగా తెలంగాణ ప్రాంతానికి వలస వచ్చి ఆదివాసులకు అందవలసిన విద్య ఉద్యోగ రాజకీయ పరమైన రిజర్వేషన్ కొల్లగొడుతున్నారని వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించుటకు కమిషన్



నియమించేంతవరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించి పోరాటం చేయాలని తెలంగాణ రాష్ట్ర నడి బొడ్డులో ఇంద్ర పార్క్ వద్ద జరిగే ఆదివాసీల ఆత్మ గోషా మహా ధర్నాకు ఆదివాసీ ప్రజలు,విద్యార్థులు, ఉద్యోగులు మహిళలు ప్రజా స్వామిక వదులు వేలాదిగా కదిలీరవాలని పిలుపునిస్తున్నాం.ఈ కార్యక్రమం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్, రమణాల లక్ష్మయ్య తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్క యాదగిరి, వట్టం కన్నయ్య, పూనెం సందీప్ తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కొత్తగూడ, మల్లెల సారయ్య కొత్తగూడ మండల ప్రధాన కార్యదర్శి, తుడుం దెబ్బ మండల కమిటీ సభ్యులు ఈసం వెంకన్న, బీజ్జ సందీప్,బుర్క శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# ఓటు మ్యాపింగ్‌పై అవగాహన



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** పాతర్లపాడు: గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటు మ్యాపింగ్ ప్రక్రియ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో మంగళవారం ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఓటు మ్యాపింగ్‌పై సిబ్బందికి వివరించారు. ఓటర్ల వివరాల పరిశీలన, మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓబీనబోయిన లక్ష్మీ అచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పరిపాలన అధికారి, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారమైన శిక్షారత్న అవార్డును పొందిన

- కృష్ణ కుమార్ సన్మానించిన ఎమ్మెల్యే ..



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** తెలంగాణ రాష్ట్రంలో కన్హ శాంతి వనంలో నూతనంగా ప్రారంభించిన హరి యూనివర్సిటీ నుంచి జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పీఎం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, గద్వాల కు చెందిన గణిత ఉపాధ్యాయుడు ఢ స్కౌట్ మాస్టర్ శ్రీ కృష్ణ కుమార్ పటికే ని ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్యేశ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు పొందిన శ్రీ కృష్ణ కుమార్ పటికే ని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

గత 16 సంవత్సరాలుగా గద్వాల పట్టణంలో విద్యారంగంలో చేస్తున్నటువంటి కృషిని గుర్తించి,జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ప్రతిష్టాత్మకమైన శిక్షారత్న అవార్డును కన్హ శాంతి వనంలోని హార్ట్ ఫుల్ నెస్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ( హెచ్ ఏ ఆర్ ఐ ) లో ప్రధానం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగులు యాదవ్, మాజీ కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, గంగాధర్ గౌడ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 1000 రోజుల కాంగ్రెస్ వైఫల్య పాలనలో దోచుకోవడం దాచుకోవడంపైనే కాంగ్రెస్ దృష్టి....

- కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలనలో భాగంగా... అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి,7 రోజుల కార్యక్రమలపై ప్రెస్ మీట్ నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి
- బాసు హనుమంతు నాయుడు
- మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని 1000 రోజుల కాంగ్రెస్ వైఫల్య పాలనలో భాగంగా.... బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని 6 గ్యారంటీలు,420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ... డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి,వినతిపత్రం సమర్పించి,7 రోజుల ప్రభుత్వపై నిర్వహించిన నిరసన కార్యక్రమాలపై మీడియా సమావేశం నిర్వహించారు......

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....

ఆరు గ్యారంటీలు,420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలు నిరాశకు గురయ్యారని విమర్శించారు..అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ఎలా దోచుకోవాలి? ఎలా దాచుకోవాలనే వాటిపైనే దృష్టి సారించారని ఆరోపించారు..కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హామీల అమలుపై ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించేందుకు బాకీ కార్డులను పంపిణీ చేసి,ప్రభుత్వాన్ని పై 7 రోజుల పాటు నిరసన తెలిపినట్లు తెలిపారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలయ్యాయో ప్రజలకు వివరించామని అని అన్నారు..గత 7 రోజుల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పై జరిగిన నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చినట్లు తెలిపారు.....

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రశ్నిస్తూనే ఉంటామని ప్రభుత్వానికి హెచ్చరించారు....

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు బాసు శ్యామల,పద్మ వెంకటేశ్వర రెడ్డి,నాగర్ దొడ్డి వెంకట్రాములు, జి.రాఘవేంద్ర రెడ్డి,కౌన్సిలర్లు చిత్తరి మంజుల రాణి కిరణ్,కమ్మరి సునీత రాము, లత రామకృష్ణ,పులిపాటి వెంకటేష్,చంటన్న,చీ= జగదీష్, గువ్వల గోపాల్,దుబన్న, నరసింహులు, మోహన్ యాదవ్,సర్పంచులు సాకి డేవిడ్,సత్యాన్న,ఉప సర్పంచులు మరియు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.....

## ఉరి వేసుకోని వృద్ధుడు వృత్తి,

**సెప్టెంబర్ 08 (సీ కే న్యూస్) చేగుంట** :చేగుంట మండల్ పులిమామిడి గ్రామానికి చెందిన గొర్రె దుర్గయ్య తండ్రి బాల నర్సయ్య వయసు 70 సం.వృత్తి వ్యవసాయం జీవితం పై విరక్తి చెంది తన వ్యవసాయ పొలం వద్ద ఉరి వేసుకుని మరణించారు. ఇట్టి విషయములో మృతిని రెండవ కుమారుడు గొర్రె నాగరాజు ఫిర్యాదు మేరకు ఎల్. భిక్యా నాయక్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు,



## కొత్తూరులో రూ.1.42 కోట్ల విలువైన హాష్ ఆయిల్ స్వాధీనం

- ఒకరి అరెస్ట్.. 11.319 కిలోల హాష్ ఆయిల్, సెల్‌ఫోన్ స్వాధీనం
- కొత్తూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. నాగార్జునరెడ్డి వెల్లడి



కొత్తూర్ పోలీసులు, ప్రత్యేక ఆపరేషన్ బృందం (ఎస్ఓటీ), షాద్‌నగర్ జోన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా హాష్ ఆయిల్‌ను తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మొత్తం 11.319 కిలోల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.1.42 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు ఇన్ముల్‌నర్వలోని పి అండ్ జీ కంపెనీ రోడ్డు దాటి వెళ్లిన అనంతరం అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడిని హెచ్. ధృవ్ అలియాస్ ధృవ్ జోషి (30)గా గుర్తించారు. అతను మెద్చల్--మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల్‌కు చెందినవాడని, ప్రస్తుతం ఒడిశా రాష్ట్రంలో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద ఉన్న కళాశాల బ్యాగ్‌ను తనిఖీ చేయగా 11 ప్యాకెట్లలో హాష్ ఆయిల్ లభించింది. ముదురు గోధుమ రంగులో చిక్కటి ద్రవ రూపంలో ఉన్న ఈ పదార్థానికి గంజాయి నుంచి తయారైన హాష్ ఆయిల్‌కు ఉండే ప్రత్యేకమైన ఘాటైన వాసన ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విచారణలో నిందితుడు ఈ హాష్ ఆయిల్‌ను ఒడిశా రాష్ట్రానికి చెందిన రోహిత్ అనే వ్యక్తి వద్ద నుంచి తీసుకుని, కొత్తూర్ పరిధిలో అవసరమైన వారికి విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ రవాణా ద్వారా ఆర్థిక లాభం పొందేందుకు కమిషన్ లేదా వాటా ప్రాతిపదికన పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 11 ప్యాకెట్లలో ఉన్న మొత్తం 11.319 కిలోల హాష్ ఆయిల్‌తో పాటు ట్విలైట్ పర్పుల్ రంగులోని రియల్‌మీ 12ఎక్స్ 5జీ స్మార్ట్‌ఫోన్ ఉంది. ఈ అరెస్ట్, స్వాధీనం చర్యలు షాద్‌నగర్ జోన్ డీసీపీ సి. శిరీష, షాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో, కొత్తూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా విద్యార్థుల పదవీ ప్రమాణోత్సవం.




**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08:** భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో గల శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల క్యాబినెట్ ఎన్నికలు నిర్వహించి, అనంతరం పదవీ ప్రమాణోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన క్యాబినెట్ ఎన్నికల్లో వివిధ హోదాలకు ఎంపికైన విద్యార్థులకు వారి పదవులను అధికారికంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు బాధ్యతలు, నాయకత్వ లక్షణాలు, పాఠశాల పట్ల వారి కర్తవ్యాలను వివరించారు. విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించి, వారికి నాయకత్వ బాధ్యతలను అప్పగించారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి. గోపాల్, స్కూల్ ఏజీఎం వీరన్న, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి. గోపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే పాఠశాల క్యాబినెట్ వ్యవస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో, నిజాయితీగా నిర్వర్తించాలని సూచించారు.

## తిరుమలాపురంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**ఆపన్నులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం -- పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా.**



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** తిరుమలాపురం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ (జవీ=ఖీ) చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రెడ్డిబోయిన మహేష్ భార్య శ్రావణికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.20,000 ఆర్థిక సహాయం మంజూరైంది.

మంజూరైన రూ.20,000 విలువైన చెక్కును గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి వీరయ్య లబ్ధిదారురాలికి అందజేశారు. ఈ సందర్భంగా బండి వీరయ్య మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

“ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండటం అభినందనీయం. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం” అని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో 7వ వార్డు నెంబర్ దారెల్లి సురేష్, 2వ వార్డు నెంబర్ బండి రేణుక, చింతల రామారావు, వేముల కోటేశ్వరరావు, రాజోల రాంబాబు, చాపలమడుగు ప్రభాకర్, బండి లక్ష్మిపతి, రాజోల వెంకటేష్ తదితర గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరుస మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్ -- రిమాండ్‌కు తరలింపు.

**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08:** భద్రాచలం పట్టణంలో గత కొంతకాలంగా వరుసగా మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. భద్రాచలం పట్టణంలో మోటార్ సైకిళ్ల దొంగతనాలపై అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు భద్రాచలం టౌన్ ఎస్ఐ బి. రామకృష్ణ సిబ్బందితో కలిసి మంగళవారం కూనవరం రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మోటార్ సైకిల్‌పై వెళ్తున్న గుగులోత్ శ్రీను, తండ్రి భాను దేవా, గాంధీనగర్, సారపాకకు చెందిన వ్యక్తిని ఆపి వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించాలని కోరారు. అయితే సరైన పత్రాలు చూపకపోవడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, గత కొంతకాలంగా భద్రాచలం, దుమ్ముగూడెం ప్రాంతాల్లో మోటార్ సైకిళ్లను దొంగతనం చేసినట్లు అంగీకరించాడు.

నిందితుడి నుంచి నాలుగు మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై గతంలో కూడా పలు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**వాహన దొంగతనాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

మోటార్ సైకిల్ దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారని భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి తమ వాహనాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. వీలైనంత వరకు ప్రజలు తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సూచించారు.



## శ్రీ జమదగ్ని సమేత శ్రీ జములమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న

**గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిడ (టి జీ ఎస్ జి డీ సీ ఎఫ్ ఎల్)గొర్రెలు మేకల కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య**



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల**

జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని జామిచేడు గ్రామంలో జరిగిన శ్రీశ్రీ జమదగ్ని సమేత శ్రీ జములమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిడ (టీజీ ఎస్ సి డి సి ఎఫ్ ఎల్)గొర్రెలు మేకల కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి సరిత తిరుపతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఈఓ పురంధర్ బాజా భజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆమెకు ప్రత్యేక అర్చనలు చేసి శాలువాతో సన్మానించారు.

అనంతరం కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బి కే ఎన్ ఆర్ టీం సి ఎస్ జి వినాయకుడి లోగో ఆవిష్కరణ

**ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ**



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని 28వ వార్డు శేరల్లీ వీధిలో కౌన్సిలర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన బి కే ఎం ఆర్ టీం సి ఎస్ జి వినాయకుడి లోగోను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు.

**ఎమ్మెల్యే మాట్లాడుతూ.....**

వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ తుమ్మల నర్సింహులు యాదవ్, నరహరి గౌడ్, నరహరి శ్రీనివాసులు నాయకులు కురుమన్న, వెంకటేశ్వర్‌రెడ్డి, మాల శ్రీనివాసులు, నరసింహులు, కిరణ్, చిరు, నారాయణ రెడ్డి జర్నలిస్టు లోకేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు ఆగస్టిన్ ను ఘన సన్మానం ఎమ్మెల్యే



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న తప్పెట్లమోర్సు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు శ్రీ పి. ఆగస్టిన్ ని ఈ రోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల గౌరవ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ...

ఆగస్టిన్ విద్యా సేవలను అభినందిస్తూ, మేడికొండ, చింతలకుంట, తప్పెట్లమోర్సు పాఠశాలల్లో ఆయన మార్గదర్శకత్వంలో విద్యార్థులు రూపొందించిన వినూత్న ఆవిష్కరణలు జాతీయ స్థాయిలో ప్రదర్శింపబడి, జోగులాంబ గద్వాల జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం ప్రశంసనీయం అని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానం, ఆవిష్కరణాత్మక దృక్పథాన్ని పెంపొందిస్తూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పిస్తున్న ఆగస్టిన్ కృషి అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. విద్యార్థుల ప్రతిభకు, సహ ఉపాధ్యాయుల కృషికి, జోగులాంబ గద్వాల జిల్లా విద్యా ప్రస్థానానికి లభించిన గౌరవం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రాజనందం పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 11 నుండి 16.వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి.

**పోకల వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు**

**గరిడేపల్లి సికె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజలను వెట్టి చాకిరి నుండి విముక్తి చేయటం కోసం, నైజాం నవాబులపై, నాటి దొరలపై, దేశముఖ్ ల పై భూస్వాములపై,

ఖాసీం రజ్వీ, రజాకారు సేనలకు వ్యతిరేకంగా, పేద ప్రజల పక్షాన పోరాడి అమరులైన, అమరవీరుల జ్ఞాపకార్థం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 16 వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను మండలంలోని గ్రామ గ్రామాన జరిపి అమరుల ఆశయ సాధనకు పునరంకితం కావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు పార్టీ కార్యకర్తలను కోరారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ప్రచారం లో భాగంగా ఈరోజు మండలంలోని పొనుగోడు గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు పొనుగోడు గ్రామ మాజీ సర్పంచ్, తన ఆస్తిలో తన పిల్లల తో సమానంగా మూడోవంతు ఆస్తిని సిపిఐ పార్టీకి విరాళం ఇచ్చిన ధాత త్యాగశీలి కామ్రేడ్ అనుమాల లింగయ్య స్మారకస్తూపాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అప్పయ్య రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జిల్లా కనకయ్య సిపిఐ పొనుగోడు గ్రామ కార్యదర్శి వేశాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుసూదన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- అంబటి వెంకటేశ్వరరావు
- మత్తేపల్లి ఏఎంసీ చైర్మన్.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్‌పై శాసనమండలి సభ్యుడు తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను.

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై ఈ తరహా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను అవమానించడమే. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా ఉన్న స్పీకర్ పదవిని ప్రతి ప్రజాప్రతినిధి గౌరవించాల్సిన బాధ్యత ఉంది.

బాధ్యతాయుతమైన శాసనమండలి సభ్యుడిగా ఉన్న తాతా మధుసూదన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమాజం హర్షించదు. బీఆర్ఎస్ పార్టీ అనుచిత భాషకు తాతా మధుసూదన్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని ప్రజలు భావించే పరిస్థితి ఏర్పడింది.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన రాజకీయ శిక్షణ ఇదేనా? ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి ప్రజాప్రతినిధికి ఉంది.

తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని తీవ్రంగా బాధించాయి. ఇలాంటి వ్యాఖ్యలను ఉపేక్షిస్తే భవిష్యత్తులో రాజ్యాంగబద్ధ పదవుల గౌరవం మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది.

అందువల్ల తాతా మధుసూదన్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాను.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**నిరుద్యోగ జేఏసీ నాయకులు ధరావత్ నరసింహ నాయక్**



**చింతలపాలెం సీకే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** ప్రభుత్వం ప్రతి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను నమ్మించి గద్దెకింది కానీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు మాత్రం మరిచిపోయింది ప్రభుత్వాన్ని ఇచ్చిన హామీ గుర్తుచేయాలని నిరుద్యోగ జేఏసీ అసెంబ్లీ ముట్టడి పిలుపు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు పొద్దున్నే మమ్మల్ని ముందస్తు అరెస్ట్ చేయడం జరిగింది ఈ సందర్భంగా నిరుద్యోగ సూర్యాపేట జిల్లా కన్వీనర్ ధరావత్ నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ నిర్వర్తించాలని లేనియెడల ప్రభుత్వాన్ని నిరుద్యోగులు తెచ్చారు నిరుద్యోగుల ద్వారానే ఈ ప్రభుత్వం పోతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఇట్టి కార్యక్రమంలో నిరుద్యోగులైన లావూరి నాగరాజు బోడా కృష్ణ తదితరులు పాల్గొన్నారు